# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 186

VEKUVA SAMAYAM TELUGU DAILY

★ Mahabubnagar ★ Hyderabad ★ Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: మంగళవారం 04 ఆగష్టు 2026








**బిహార్‌లోని బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు. ప్రశాంత్ కిశోర్ తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించారు.**

**సమయం ప్రతినిధి:** నేడు కౌంటింగ్ మొదలైనప్పటి నుంచీ బీజేపీ నేత నీరజ్ కుమార్ కంటే ముందంజలో ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక్కో రౌండ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకున్నారు. పీకేకు 63,203 పోలయ్యాయి. అలానే రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ కు 44,250, మూడో స్థానంలో నిలిచిన ఆర్జేడీ అభ్యర్థి రేఖ కుమారి 14,085 ఓట్లు సాధించారు. ఈ చరిత్రాత్మక విజయం అనంతరం ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. తన గెలుపు బీజేపీ హైకమాండ్‌కు ఒక బలమైన సందేశమని వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తిని బిహార్ ముఖ్యమంత్రిగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, సామ్రాట్ చౌదరిని వెంటనే సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపఎన్నిక ఫలితం బిహార్ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభకు ఎన్నికైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. బంకీపూర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. బీజేపీ కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో.. 1995 నుంచి బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ అసాధారణ విజయం సాధించడం, బీజేపీ కంచుకోటలో జేఎస్‌పీ జెండా ఎగురవేయడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది.




**కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన మంత్రివర్గాన్ని భారీగా విస్తరించింది. కాంగ్రెస్ అధిష్టానం ఆమోదం తెలపడంతో 20 మంది నూతన నాయకులను కేబినెట్‌లోకి తీసుకున్నారు. సామాజిక సమతుల్యత, అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ ఎస్సీ, ఎస్టీ, లింగాయత్, వొక్కలిగ, మైనారిటీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేశారు.**

**సమయం ప్రతినిధి:** బెంగళూరులోని లోక్‌భవన్‌లో ఈ సాయంత్రం నూతన మంత్రుల ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది.

**కేబినెట్‌లో కులాల వారీ ప్రాతినిధ్యం**

దళిత వర్గాలకు రికార్డు ప్రాతినిధ్యం (SC/ST): రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా 7 మంది ఎస్సీ (SC) నేతలకు కేబినెట్‌లో చోటు దక్కింది. వీరిలో ఎస్సీ-రైట్ నుంచి ముగ్గురు, ఎస్సీ-లెఫ్ట్ నుంచి ఇద్దరు, లంబానీ, భోవి వర్గాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. వీరితో పాటు ముగ్గురు ఎస్టీ (ST) వర్గానికి చెందిన నేతలకు స్థానం లభించింది.

**నూతన మంత్రుల జాబితా :** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించిన జాబితా ప్రకారం: పి.ఎం. నరేంద్రస్వామి, శివరాజ్ తంగడగి, రుద్రప్ప లామణి, కె.ఎస్. బసవంతప్ప, బి. నాగేంద్ర, టి. రఘుమూర్తి, బి.జెడ్. జమీర్ అహ్మద్ ఖాన్, రిజ్వాన్ అర్షద్, సంతోష్ లాడ్, మధు బంగారప్ప, పుట్టరంగశెట్టి, మంకాల్ వైద్య, అజయ్ సింగ్, ఎన్. చెలువరాయ స్వామి, కె.ఎమ్. శివలింగే గౌడ, హెచ్.సి. బాలకృష్ణ, గాయత్రి శాంతెగౌడ, బసవరాజ్ రాయరెడ్డి, విజయానంద్ కాశప్పనవర్, మరియు లక్ష్మణ్ సవది మంత్రులుగా ప్రమాణం చేశారు. మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న ఏకైక మహిళా నేతగా గాయత్రి శాంతెగౌడ నిలిచారు.

## నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు. నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని సీఎం పేర్కొన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందని చెప్పుకొచ్చారు. వైద్య రంగంలో నిమ్స్ మరిన్ని మైలురాళ్లు సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** భాగ్యనగర వాసులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ అలర్ట్ జారీ చేశారు. ఈరోజు (సోమవారం) రాత్రి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. ఈనేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. బయట ఉన్నవారు వెంటనే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని సీపీ సజ్జనార్ తెలిపారు. నీరు నిలిచిన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ప్రయాణాలు చేయొద్దని హెచ్చరించారు. ముంపు ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనదారులు వేగం తగ్గించి జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

### తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం: జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి, ఆగస్టు 3 (సమయం ప్రతినిధి):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు (ఆగస్టు 1 నుంచి 7 వరకు) సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారమని, పుట్టిన తొలి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం అత్యంత అవసరమన్నారు. పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం పౌష్టికాహారంతో పాటు రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన పోషకాలను అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించి అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికీ అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రపంచ తల్లిపాల వారోత్సవాల నినాదమైన "తల్లిపాలకు ప్రాధాన్యత ఇద్దాం - సుస్థిరమైన సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చేర్చేలా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, తల్లిపాలు ఇవ్వడం కేవలం తల్లి బాధ్యత మాత్రమే కాదని, కుటుంబం, సమాజం, ప్రభుత్వం కలిసి తల్లులకు పూర్తి సహకారం అందించాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ మాట్లాడుతూ, ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు పుట్టిన తొలి గంటలోనే శిశువుకు తల్లిపాలు అందించేలా కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి స్వర్ణలత, అడ్మినిస్ట్రేషన్ అధికారి సునీల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సీడీపీవోలు, జిల్లా సంక్షేమ శాఖ, డీహెచ్‌ఈడబ్ల్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి మోసం చేశారు.. సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం



**(సమయం ప్రతినిధి):** అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఈరోజు (సోమవారం) మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరలో గడ్డం వేణు అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని ప్రస్తావించారు. రెండు పేజీల సూసైడ్ నోట్‌లో సీఎం, డిప్యూటీ సీఎం, రాహుల్‌గాంధీకి రాశారని.. ఈ లేఖను వారికి షేర్ చేయాలని ఆయన తన సూసైడ్ నోట్‌లో తెలిపారని అన్నారు. గడ్డం వేణు రాసింది సూసైడ్ నోట్ కాదని కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ అని చెప్పుకొచ్చారు.

**యువత నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు..**

వేణు రాసిన సూసైడ్ నోట్ సీఎం రేవంత్‌రెడ్డికి అందిందా...? రాష్ట్రంలో, దేశంలో యువత నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. యూత్ డిక్లరేషన్ పేరుతో ఢిల్లీ నుంచి పెద్ద వాళ్లను తీసుకువచ్చి బిల్లప్పులు కొట్టారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొడితే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు అనలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు ఈ విషయంపై స్పందించడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ కనపడరని చెప్పుకొచ్చారు. సొంత నియోజకవర్గంలో యువకుడు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నం చేసుకుంటే భట్టి ఎందుకు స్పందించరని ప్రశ్నల వర్షం కురిపించారు. 16,979 ఉద్యోగాలు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చెప్పిందన్నారు. తమ హయాంలో 2లక్షల 32వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని ప్రస్తావించారు.

**రేవంత్‌రెడ్డికి సప్లిమెంటరీలో పాస్ కావడం అలవాటు..**

ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను పట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి క్రిమినల్ వేస్ట్ అంటే రాహుల్ గాంధీలో ఎందుకు ఎలాంటి చలనం లేదని మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. ఐటీ రంగంలో ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రపంచంలో రాణిస్తున్నారని వ్యాఖ్యానించారు. 83 క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్‌రెడ్డిని సీఎం చేయడం క్రిమినల్ వేస్ట్ కాదా అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ.. రేవంత్‌రెడ్డిని నమ్మడం క్రిమినల్ వేస్ట్ అని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డికి సప్లిమెంటరీలో పాస్ కావడం అలవాటని విమర్శించారు. ఎమ్మెల్యేగా ఓడిపోతే సప్లిమెంటరీలో రేవంత్‌రెడ్డి ఎంపీ అయ్యారని చెప్పుకొచ్చారు. ఆయన ఎన్నడైనా పోటీ పరీక్షలు, ఎంట్రన్స్ పరీక్షలు రాశారా...? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి సమాధి కట్టడం ఇంజినీరింగ్ విద్యార్థులకు తెలుసు అని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి బీఆర్‌ఎస్ నాయకుడిని కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు.

**ఆ తీర్మానం నాలుక గీసుకోవడానికి కూడా పనికి రాదు..**

అసెంబ్లీ సమావేశాలు 15రోజుల పాటు నడపాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి పరిధిలో లేని వాటి గురించి మాట్లాడతారని విమర్శించారు. 21 ఏళ్లకే యువతకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశంపై సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం నాలుక గీసుకోవడానికి కూడా పనికి రాదని ఎద్దేవా చేశారు.

## ప్రజావాణిలో 102 ఫిర్యాదులు

### ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**రంగారెడ్డి, ఆగస్టు 3 (సమయం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 102 ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 33, ఇతర శాఖలకు 69, మొత్తం 102 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భారతీయ బహుళత్వమే నియంతృత్వం నుంచి రక్ష!

నేటి హిందుత్వ భావజాలం భారతీయ భక్తిమార్గంలోని లలితమైన బహుళత్వాన్ని, స్వేచ్ఛను తుడిచిపెడుతోంది. పాశ్చాత్య మతాలలోని 'ప్రభువు' భావనను అరువు తెచ్చుకుని, ఒక సర్వాధికారిని, ఒక నియంతను ఆరాధించే సంస్కృతిని హిందూ సమాజంలోకి చొప్పిస్తోంది. దేవుడిని సైతం ఒక రాజకీయ పాలకుడిగా, అధికార కేంద్రంగా మార్చే ప్రక్రియ ఇది. దేవానాంప్రియ తన సామ్రాజ్యంలో ఉన్న ఆటవిక తెగలను (గిరిజనులను) అనునయిస్తున్నాడు. అదే సమయంలో తన వద్ద ఉన్న శక్తిని (శిక్షించే అధికారాన్ని) వారికి గుర్తుచేస్తున్నాడు. జాతీయ రాజ్యం ఏర్పాటులోనే నియంతృత్వానికి సంబంధించిన బీజాలు అంతర్గతంగా ఉన్నాయి. అయితే, భారతదేశంలో శతాబ్దాలుగా వర్ధిల్లిన స్థానిక సంప్రదాయక బహుళత్వం ఆ నియంతృత్వాన్ని ఒక పెద్ద వృక్షంగా ఎదగకుండా అడ్డుకుంటూ వచ్చింది. జాతీయవాదం, జాతీయ రాజ్యం అనేవి కాలక్రమేణా కేంద్రీకృత నియంతృత్వానికి దారితీస్తాయని రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారు స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనే గుర్తించి హెచ్చరించారు. గాంధీ కూడా ఈ ప్రమాదాన్ని గ్రహించి, బహుళత్వాన్ని జాతీయవాదంతో మిళితం చేయడానికి ప్రయత్నించారు.

భారత రాజ్యాంగం పౌరులకు జీవించే హక్కు, మాట్లాడే హక్కు వంటి ప్రాథమిక హక్కులను హామీ ఇచ్చింది. కానీ, జాతీయ రాజ్యానికి భౌగోళిక సరిహద్దులు ఎంత ముఖ్యమో, పౌరుల హక్కులపై రాజ్యానికి ఉండే నియంత్రణకూ అంతే బలమైన సరిహద్దులు ఏర్పడ్డాయి. ఆ సరిహద్దుల పేరే 'ప్రివెంటివ్ డిటెన్షన్ లా' (నిరోధక నిర్బంధ చట్టం). భౌతికశాస్త్రంలో 'బ్లాక్ హోల్'లో సర్వ భౌతిక సూత్రాలు ఎలాగైతే విఫలమవుతాయో, ఈ ప్రివెంటివ్ డిటెన్షన్ పరిధిలోకి వచ్చాక పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన అన్ని ప్రాథమిక హక్కులు పోతాయి.

సాధారణ చట్టాల ప్రకారం ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు లభించే కనీస రక్షణలు కూడా ఇందులో ఉండవు. రాజ్యాంగంలోని ఈ నిబంధనల నుంచి పుట్టిన సంతానమే నేటి ఉపా వంటి నల్ల చట్టాలు. న్యాయస్థానాలు, ప్రభుత్వాలు చేతులు కలిపి ప్రజల హక్కులను నిరాకరించడం భారత చరిత్రలో కొత్తేమీ కాదు. కానీ, నేడు పౌర సమాజంలో పెరిగిన హిందుత్వ భావజాలం, హిందూ జాతీయవాదం ఇటువంటి ప్రజావ్యతిరేక చట్టాలకు, రాజ్య హింసకు పౌరుల నుంచే ఒక విస్తృతమైన 'సమ్మతి' లభించేలా చేస్తున్నాయి. అసలైన ప్రమాదం ఇక్కడే పొంచి ఉంది. అంబేడ్కర్, నెహ్రూలతో సహా ఆధునిక భారత నిర్మాతలంతా కేంద్రీకృత రాజ్యాన్ని గత సమాజంలోని మూర్ఖత్వాలు, సంకుచితత్వాలు, భూస్వామ్య దొరతనం, కులతత్వం నుంచి లభించే విముక్తిగా భావించారు. ఆ విముక్తి కోసమే వారు కేంద్రీకృత రాజ్యాన్ని బలపరచాలని నమ్మారు. ఆ రాజ్యాన్ని నిలపడం కోసం, దేశ సమగ్రత కోసం అవసరమైతే పౌరుల హక్కులను కుదించవచ్చని వారు భావించారు. దాని ఫలితమే రాజ్యాంగంలో నిర్బంధ చట్టాలకు చోటు దక్కడం. దీనివల్ల భారతదేశంలో ప్రభుత్వాలు అనేకసార్లు పేదలు, మైనారిటీల పట్ల వివక్షాపూరితంగా వ్యవహరించాయని మేధావులు, జర్నలిస్టులు నిరంతరం స్పష్టం చేస్తూనే ఉన్నారు. రాజ్యం రహస్యంగా హక్కులను హరించడం ఒక ఎత్తయితే, ఇప్పుడు పౌర సమాజంలోనే ఆ హక్కులు హరించడాన్ని సమర్థించేలా ఒక ఉన్మాద భావజాలం వ్యాప్తి చెందడం పెద్ద విషాదం.

భారతదేశ ఆత్మ నిలబడింది ఇక్కడి వైవిధ్యంలో. మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక చరిత్రను పరిశీలిస్తే, భారతీయ భక్తి మార్గం దేవుడిని ఒక సర్వాధికారిగా చూడలేదు. ఇక్కడ దేవుడు స్నేహితుడు (సఖుడు), ప్రియుడు, బిడ్డ, ఆఖరికి వాదనకు దిగే ఒక తోటివాడిగా కనిపిస్తాడు. భగవంతుడితో పౌరుడికి ఉండే సంబంధం స్వేచ్ఛతో కూడుకున్నది. కానీ, పాశ్చాత్య ప్రొటెస్టంట్ లేదా అబ్రహామిక్ మత భావనలలో 'ప్రభువు' అనే భావన ప్రధానమైనది. అక్కడ దేవుడంటే సర్వశక్తిమంతుడు, ఆజ్ఞలు జారీ చేసేవాడు, భయపడి లొంగిపోవాల్సిన ఒక పాలకుడు. స్వేచ్ఛను భరించలేని ప్రజలు నియంతను ఆశ్రయించే అవకాశం ఉంటుందని ఎరిక్ ఫ్రామ్ అనే తత్వవేత్త చెప్పారు. నేటి హిందుత్వ భావజాలం భారతీయ భక్తి మార్గంలోని ఈ లలితమైన బహుళత్వాన్ని, స్వేచ్ఛను పూర్తిగా తుడిచిపెడుతోంది. ఇది పాశ్చాత్య మతాలలోని 'ప్రభువు' భావనను అరువు తెచ్చుకుని, ఒక సర్వాధికారిని, ఒక నియంతను ఆరాధించే సంస్కృతిని హిందూ సమాజంలోకి చొప్పిస్తోంది. దేవుడిని సైతం ఒక రాజకీయ పాలకుడిగా, అధికార కేంద్రంగా మార్చే ప్రక్రియ ఇది. దీనివల్లే స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ఉన్న 'అన్ని మతాలు, సంస్కృతుల సమ్మేళనం' అనే స్పృహ నేడు వెటకారానికి గురవుతోంది. ఒకే చట్టం, ఒకే మతం, ఒకే ధర్మం, ఒకే రాజ్యం అనే ఏకశిలా మూస ఆలోచనలకు ప్రాధాన్యం పెరుగుతోంది. రాజ్యం కేంద్రీకృతమయ్యేకొద్దీ పౌరుడి హక్కులు ఎలా నలిగిపోతాయో అర్థం చేసుకోవడానికి మన ప్రాచీన రాజకీయ చారిత్రక పరిణామ క్రమమే ఉదాహరణ. మొదటవెలసిన మౌర్య సామ్రాజ్యం ఒక బలమైన కేంద్రీకృత మహా సామ్రాజ్యం. ఆ కాలానికి చెందిన కౌటిల్యుని 'అర్థశాస్త్రం' ప్రకారం... రాజ్యాన్ని నిలపడమే అన్నిటికంటే ప్రధాన లక్ష్యం. అక్కడ ధర్మం కంటే రాజ్యాధికారానిదే పైచేయి. అందుకే, వర్ణ వ్యవస్థలో ఉన్నత స్థానంలో ఉన్న బ్రాహ్మణుడు సైతం రాజద్రోహానికి లేదా రాజధిక్కారానికి పాల్పడితే అతనికి మరణ శిక్ష విధించవచ్చని అర్థశాస్త్రం నిర్దేశించింది. ఇంక సామాన్యుడి పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఈ వ్యవస్థలో పౌరుడి కంటే సామ్రాజ్య రక్షణే పరమావధి కాబట్టి, ఇందులో ఒక రకమైన 'మత్స్య న్యాయం' (రాజ్యాధికార బలం) అంతర్లీనంగా చట్టబద్ధమైంది. కానీ, మౌర్య సామ్రాజ్య పతనం తర్వాతి కాలంలో విస్తరించిన గ్రామీణ సమాజాలు, చిన్న చిన్న రాజ్యాల నేపథ్యంలో రూపుదిద్దుకున్న ధర్మశాస్త్రాలు, మనుస్మృతి వంటి స్మృతి గ్రంథాలు దీనికి భిన్నమైన వైఖరిని ప్రదర్శించాయి. ఈ గ్రంథాలలో వర్ణ/ కుల వివక్షలు, సామాజిక అసమానతలు తీవ్రంగా ఉన్న మాట నిజమే అయినప్పటికీ, ఇవి కేంద్రీకృత రాజ్యాధికార బలాన్ని లేదా 'మత్స్య న్యాయాన్ని' పూర్తిగా వ్యతిరేకించాయి. 'రాజు కంటే ధర్మమే గొప్పది' అని ఇవి స్పష్టం చేశాయి. ఈ స్మృతి గ్రంథాలు ఆర్థిక నేరాలలో కింది వర్ణాల కంటే, సమాజంలో ఎక్కువ బాధ్యత కలిగి ఉండాల్సిన బ్రాహ్మణుడికి, క్షత్రియుడికే ఎక్కువ శిక్షలను విధించాయి. చదువు జ్ఞానం ఉన్న శిష్ట వర్గాలనే ఇటువంటి నేరాలలో తీవ్రంగా శిక్షించాలని మనువు భావించాడు. నేటి పరిస్థితి దీనికి పూర్తి విరుద్ధం. అంటే చారిత్రకంగా చూస్తే, కేంద్రీకృత మహా సామ్రాజ్యాల కాలంలోనే (అర్థశాస్త్ర కాలంలో) రాజ్య రక్షణ పేరిట హక్కుల్ని హరించడం తీవ్రంగా ఉండేది. అలాగే ప్రజల హక్కుల గురించి మాట్లాడే నేటి ఆధునిక కేంద్రీకృత రాజ్యంలో మరింత తీవ్రమైన హక్కుల హరణ కనిపిస్తోంది. ఉమ్మడి పౌర స్మృతి పేరుతో గిరిజనుల మైనారిటీల ప్రత్యేక హక్కులను హరించే ప్రమాదం ఉందని, ఒకే ఒక సంస్కృతిని ఎప్పటిలాగే రుద్దే ప్రమాదం ఉందని అందరూ భయపడుతున్నారు. నేటి గ్లోబల్ మెగా నాగరికతల ప్రపంచంలో, జాతీయ రాజ్యం కోసం అమాయకులను బలి చేయడం కూడా అభివృద్ధి పేరుతో, దేశభక్తి పేరుతో ఆమోదం పొందుతోంది. మతం, సంస్కృతి అనే పదాలు దానికి పౌర సమాజంలో సమ్మతిని పెంచుతున్నాయి. ఈ కేంద్రీకృత రాజ్యానికి, ధనస్వామ్యానికి నేడు విడదీయరాని బంధం ఏర్పడింది. 17వ శతాబ్దానికి చెందిన నీలకంఠ దీక్షితులు తన 'కలివిడంబనం' అనే గ్రంథంలో– ఆధ్యాత్మికత, దేవుడు కూడా వ్యాపారమయం కావడం, ధనస్వామ్యానికి మితిమీరిన ప్రాధాన్యం రావడం పట్ల అప్పట్లోనే భయాన్ని వ్యక్తపరిచారు. అది యూరోపియన్ల వ్యాపార సంస్కృతి మన దేశాన్ని ఆక్రమిస్తున్న తొలినాళ్ల తరుణం. నేడు ఆశిష్ నంది చెప్పినట్లు– భారతదేశం అమెరికాకు ఒక సాంస్కృతిక మురికివాడగా మారుతోంది. మన జాతీయ రాజ్యం, మన సంస్కృతి అంతకంటే పెద్దదైన పాశ్చాత్య ప్రొటెస్టంట్ క్రైస్తవ నిర్మాణానికి (అధికార కేంద్రాల ఆరాధనలో, ఏకశిలా రూపంలో) ఒక నకలుగా మారుతున్నాయి. నిర్బంధ చట్టాల ద్వారా జాతీయ రాజ్యం అనే వ్యవస్థ నెరపబోయే నియంతృత్వం గురించి ఆనాడే రాజ్యాంగ పరిషత్తులో మహావీర్ త్యాగి వంటి స్వాతంత్ర్య సమరయోధులు వ్యక్తపరిచిన భయాలు నేడు నిజమవుతున్నాయి. మనుస్మృతి చెప్పే అంతర్గత సామాజిక అసమానతలను అధిగమిస్తూనే, కేంద్రీకృత రాజ్య నియంతృత్వం నుంచి భారతీయ ఆత్మ అయిన బహుళత్వాన్ని కాపాడుకోవడమే నేడు మన ముందున్న ఏకైక మార్గం.

## ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రాధాన్యం

**ప్రతి ఫిర్యాదుకు చట్టబద్ధంగా వేగవంతమైన పరిష్కారం**
**ప్రజావాణి కార్యక్రమంతో పోలీసులపై పెరుగుతున్న విశ్వాసం**
**సోమవారం ప్రజావాణిలో 22 ఫిర్యాదుల స్వీకరణ**

వనపర్తి, ఆగసు–03: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ రోజు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 22 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా వనపర్తి ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, కి వివరించారు. ఈ సందర్భంగా ఎస్ప మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను నేరుగా విని, వాటికి తక్షణ పరిష్కారం చూపడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసే నమ్మకమైన వేదికగా మారిందన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని చట్టబద్ధంగా, వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖపై విశ్వాసం ఉంచి, తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.




ఈ రోజు ప్రజావాణిలో 22 ఫిర్యాదులు:
02 – భార్యాభర్తల వివాదాలకు సంబంధించినవి
15 – భూ తగాదాలకు సంబంధించినవి
05 – పరస్పర గొడవలకు సంబంధించినవి

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన పెబ్బేర్ మాస్టర్ మైండ్స్ విద్యార్థులు......

పెబ్బేరు ఆగస్టు 3 (సమయం ప్రతినిధి) : వనపర్తి జిల్లాలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాస్థాయిలోప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మాస్టర్ మైండ్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు.

అండర్–6: లో అర్షిత్ – 60 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం,
అండర్–8: లో యశిత – 200 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం
అండర్–8:లో అక్షయ – 60 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం
అండర్–12: లో బాల శశ్వని – 60 మీటర్ల పరుగు మరియు స్టాండింగ్ బ్రాడ్ జంప్ విభాగాల్లో ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు.

ఇట్టి విద్యార్థులు ఈనెల 7, 8 వ తేదీల్లో జె .ఎన్. స్టేడియం, హనుమకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డి మరియు ఉపాధ్యాయులందరూ హృదయపూర్వకంగా అభినందించారు. పాఠశాల డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మన వనపర్తి జిల్లాకు మరియు పెబ్బేరు పట్టణానికి మంచి గుర్తింపును తీసుకురావాలని కొనియాడారు. విద్యార్థులందరూ వ్యక్తిగతమైనటువంటి



క్రమశిక్షణతో, కఠోరమైనటువంటి సాధన చేసి, జాతీయస్థాయిలోను మరియు రాష్ట్రస్థాయిలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## నేతన్నల ఇన్ స్టా బాట

న్యూఢిల్లీ : దేశ రాజకీయాల్లో ఇప్పుడు గాలి మారింది. ఒకప్పుడు ప్రెస్ మీట్లు, కరపత్రాలతో సాగిన రాజకీయం.. ఆ తర్వాత ఫేస్‌బుక్ కథనాలు, ఎక్స్ వార్లకు మారింది. కానీ ఇప్పుడు ఆ పాత వేదికలన్నీ బామ్మల కాలం నాటి ముచ్చట్లుగా మారిపోయాయి. పొలిటికల్ లీడర్లంతా ఇప్పుడు హుటాహుటిన ఇన్‌స్టాగ్రామ్ బాట పడుతున్నారు. కారణం ఒక్కటే.. ఓటర్లలో నిశ్శబ్దంగా పెద్ద శక్తులుగా మారుతున్న జెన్ జీ ఎక్స్ ను సమాచారం తెలుసుకోవడానికి వాడుకుంటున్నారు. ఫేస్‌బుక్‌కు అసలు గుడ్ బై చెప్పేశారు. వారు రోజంతా పడికాపులు కాసేది కేవలం ఇన్‌స్టా రీల్స్, షార్ట్స్ లోనే. అందుకే ఇప్పుడు రాజకీయం నడవాలంటే కుడిచేతి బొటనవేలితో స్వైప్ చేసే రీల్స్ పవర్ కావాల్సిందేనని నేతలు డిసైడ్ అయ్యారు. విషయం ఎంత తీవ్రంగా ఉందంటే.. ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా జెన్ జీ భాషలోనే సంభాషించడానికి ఇన్‌స్టా వేదికగా ఫ్రంట్–కెమెరా సెల్ఫీ వీడియోలు , రీల్స్ పోస్ట్ చేయడం మొదలుపెట్టారు. 10.5 కోట్లకు పైగా ఫాలోవర్లతో డిజిటల్ స్పేస్‌లో ట్రెండ్ సెట్ చేస్తున్న ప్రధాని నుంచి మొదలుకొని, స్థానిక వార్డు మెంబర్ దాకా అందరూ ఇన్‌స్టా అల్గారిథమ్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ట్విట్టర్ అనేది కేవలం ప్రెస్ రిలీజ్ పోస్ట్ చేసుకునే ఆఫీస్ బోర్డుగా మారిపోగా.. ప్రచారాన్ని, వ్యక్తిత్వాన్ని వైరల్ చేసుకోవడానికి ఇన్‌స్టాగ్రామ్ ఒకే ఒక్క అస్త్రంగా మారింది. యువతను ఆకట్టుకోవాలంటే వారి మైండ్ సెట్‌కు తగ్గట్టుగా కంటెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతో పొలిటికల్ వార్ రూమ్‌లు కూడా ఇప్పుడు పిఆర్ ఏజెన్సీలతో రీల్స్ ప్రాజెక్టులు డిజైన్ చేయిస్తున్నాయి. దశాబ్దాలుగా పొడుగాటి పంచెలు, మైకులు పట్టుకుని ఐదు పేజీల మైక్ ఉపన్యాసాలు దంచేసే పాతతరం రాజకీయ నేతలకు.. ఈ 15 సెకన్ల రీల్స్ లాజిక్ అర్థం కాక చమటలు పడుతున్నాయి. జెన్ జీని మెప్పించడం కోసం కెమెరా ముందుకొచ్చి నిలబడటం, కుర్రాళ్లతో కలిసి ట్రెండింగ్ ఆడియోలకు హావభావాలు ఇవ్వడం, నేరుగా ఫోన్ వంక చూస్తూ హేయ్ గైస్ " అని పలకరించడం.. పాపం మన పొలిటీషియన్లకు పెద్ద అగ్నిపరీక్షలా మారింది. సెల్ఫీ యాంగిల్ సరిగ్గా కుదరక, మాట్లాడే స్టైల్ మోతాదు మించడంతో అనేక మంది నేతల ప్రయోగాలు మీమర్స్ కి కడుపుబ్బ నవ్వించే డైలీ కంటెంట్‌గా మారిపోతున్నాయి. మరోవైపు ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథమ్ చాలా విచిత్రమైనది. అక్కడ గంభీరమైన రాజకీయ ప్రసంగాలు చెల్లవు. జెన్ జీకి నచ్చే సరదా స్లాంగ్ , పాప్ కల్చర్ ట్రెండ్స్, కట్–షార్ట్ ఎడిటింగ్ లేకపోతే ఆ రీల్‌ను క్షణాల్లో పైకి నెట్టేస్తారు. దీంతో పొలిటికల్ పార్టీల సోషల్ మీడియా వింగ్స్.. తమ లీడర్లను ఇన్‌ఫ్లుయెన్సర్లు గా మార్చేందుకు తంటాలు పడుతున్నాయి. ఏ నాయకుడు ఏ బ్రాండ్ టీషర్ట్ వేసుకున్నారు, ఏ కాఫీ షాప్‌లో కూర్చున్నారు, యువతతో కలిసి ఎలాంటి ఫన్నీ కౌంటర్లు వేశారనే కట్–షాట్స్ కోసం ఏకంగా కెమెరా టీమ్‌లను వెంటబెట్టుకుని తిరుగుతున్నారు. నాన్–స్టాప్ పొలిటికల్ పోరాటాల కంటే రీల్స్‌కు వచ్చే లైకులు, కామెంట్లు, షేర్లే ఇప్పుడు నాయకుల పవర్‌ను కొలిచే కొలమానంగా మారాయి. ఓటు బ్యాంకు కోసం లీడర్లు పడే తిప్పలు ఇప్పుడు కేవలం వీధుల్లో పాదయాత్రలకే పరిమితం కాలేదు.. ఇన్‌స్టా స్క్రీన్ల పైకి చేరాయి. జెన్ జీ ఓటర్లను ఆకట్టుకోవడానికి అలవాటు లేని పనులు చేస్తూ, కుర్రాళ్ల ట్రెండ్స్‌ను అనుకరిస్తూ రాజకీయ నాయకులు పడుతున్న ఆర్గానిక్ అవస్థలు సామాజిక మాధ్యమాల్లో రక్తికట్టిస్తున్నాయి. ఎంత కష్టమొచ్చినా సరే.. ట్రెండింగ్ లో లేకపోతే రాజకీయంలో ఉనికికే ప్రమాదమని గుర్తించిన నేతలు, అలవాటు లేని ఈ ఇన్‌స్టా దారిలో కిందామీదా పడుతూ పయనించక తప్పడం లేదు!

## విద్యా వ్యవస్థ అంత దారుణమా...

హైదరాబాద్ : మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు లక్షా పదివేల మంది విద్యార్థులు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి పట్టాలు పొందుతున్నారు. కానీ ఈ పట్టాలు చేతపట్టుకుని బయటకు వస్తున్న యువతలో కేవలం పదిహేను శాతం మంది మాత్రమే పరిశ్రమల ప్రమాణాలకు సరిపోతున్నారు. మిగిలిన మెజారిటీ విద్యార్థులు కనీసం ప్రాథమిక కోడింగ్ లేదా కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల పరిస్థితిని ప్రస్తావిస్తూ కఠినమైన పదాలు వాడారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే గతంలో కేసీఆర్ కూడా అసెంబ్లీలో ఇదే ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరు నేతల మాటల శైలి వేరుగా ఉన్నప్పటికీ వారిద్దరి ఆవేదన వెనుక ఉన్న ప్రధాన కారణం మన విద్యావ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన లోపమే. సాంకేతిక విద్య ఈ స్థాయికి దిగజారడానికి ప్రధాన కారణం విద్యావ్యవస్థ పూర్తిగా వ్యాపారమయం కావడమే. గత కొన్ని సంవత్సరాలుగా పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేట్ కళాశాలల్లో తగినంత మౌలిక వసతులు అసలే లేవు. ఆధునిక ప్రయోగశాలలు లేకపోవడం అలాగే అనుభవం ఉన్న నాణ్యమైన అధ్యాపకుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు వేగంగా దూసుకుపోతుంటే చాలా కాలేజీలు ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే బోధిస్తున్నాయి. ప్రశ్నాపత్రాలు కేవలం పుస్తకాల్లోని విషయాలను గుడ్డిగా గుర్తుపెట్టుకుని రాసే రీతిలోనే ఉంటున్నాయి. దీనివల్ల విద్యార్థుల్లో సమస్యలను స్వయంగా పరిష్కరించే ధోరణి పూర్తిగా కరువవుతోంది. తల్లిదండ్రులు తమ కష్టపడిన సంపాదనతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే ఫీజు సాయాన్ని కలిపి లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. పిల్లలను ఎంతో ప్రయాసపడి ఇంజినీరింగ్ చదివిస్తే డిగ్రీ పూర్తయ్యాక ప్రైవేట్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు రావడం లేదు. దీనితో నిరుద్యోగ యువత తీవ్ర నైరాశ్యంలోకి వెళ్లిపోతూ చివరకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. ఇంజినీరింగ్ పాసైన కుర్రాడు కనీసం చిన్న ఉద్యోగానికైనా సరిగ్గా వెళ్లలేకపోతున్నాడనే ఆవేదన పాలకులలో స్పష్టంగా కనిపిస్తోంది. నాయకులు చేసిన తీవ్రమైన వ్యాఖ్యలలో ఎవరి మనోభావాలను కించపరచాలనే ఉద్దేశం లేదు. అక్కడ కనిపిస్తున్నది సమాజం ముందున్న ఒక స్పష్టమైన వాస్తవం. పరిశ్రమల అవసరాలకు తగ్గ ప్రాక్టికల్ నైపుణ్యాలు లేకపోవడం వల్ల యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన శిక్షణ లేని కారణంగా కనీసం ఒక చిన్న దరఖాస్తును కూడా సరిగ్గా రాయలేని స్థితిలో విద్యార్థులు బయటకు వస్తున్నారు. ఈ పరిస్థితిని మార్చడానికి కేవలం విమర్శలు సరిపోవు కానీ సరైన ప్రణాళికలు అవసరం. కాలేజీలు కేవలం మార్కులు అలాగే సర్టిఫికెట్లు ఇచ్చే యంత్రాలుగా మారడం వల్ల సమాజానికి ఒరిగేది ఏమీ లేదు. సాంకేతిక రంగంలో ప్రపంచంతో పోటీపడే అర్హతలను అందించేలా విద్యాప్రమాణాలు పూర్తిగా మారాలి. అప్పుడే యువతకు బంగారు భవిష్యత్తు లభిస్తుంది. ప్రస్తుత తరానికి అర్థమయ్యేలా సులభమైన మంచి తెలుగులో మన విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసుకోవాలి. యువత కేవలం డిగ్రీ పత్రాల కోసం కాకుండా నిజమైన నైపుణ్యాలు సంపాదించే దిశగా అడుగులు వేయాలి. ప్రభుత్వం కూడా కాలం చెల్లిన సిలబస్‌ను మార్చి పరిశ్రమలకు కావాల్సిన కోర్సులను కాలేజీల్లో ప్రవేశపెట్టాలి. అప్పుడే ఈ రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ప్రపంచ వేదికపై గర్వంగా నిలబడగలుగుతాడు. నేటితరం యువతకు కావాల్సింది కేవలం డిగ్రీ కాదు కానీ అద్భుతమైన సృజనాత్మకత. ఈ దిశగా అందరూ కలిసికట్టుగా ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

## సహజీవనంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు.. అలాంటి భాగస్వామిపై క్రిమినల్ కేసులు..

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ: సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 498–ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటిశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.

ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498–ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498–ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొంది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

# ఓటరు జాబితాల రూపకల్పనలో పారదర్శకత

**ఖచ్చితత్వానికి ప్రాధాన్యం,**
**డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి డబుల్ ఎంట్రీలు,**
**పొరపాట్లకు తావివ్వొద్దు,**
**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



నాగర్ కర్నూల్, సమయం ప్రతినిధి 03 : సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, డిజిటలైజేషన్ పనుల పురోగతి, ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ అమలుపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్దేశించిన గడువులోగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ..., ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో ఓటరు పేరు నమోదు, పేర్ల తొలగింపు, వివరాల సవరణ, చిరునామా మార్పు, లింగం, వయస్సు, ఇతర వ్యక్తిగత వివరాల్లో మార్పులకు సంబంధించిన దరఖాస్తులను అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి డబుల్ ఎంట్రీలు, నకిలీ నమోదులు, సాంకేతిక లోపాలు లేదా సమాచారం నమోదు చేసే సమయంలో పొరపాట్లు జరగకుండా అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా మాత్రమే నమోదు చేయాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..., ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రజలు ఎన్నికల సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు అందించే సేవలను సద్వినియోగం చేసుకుని ఓటరు జాబితాలను పూర్తిస్థాయిలో తప్పులులేకుండా రూపొందించేందుకు సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామనిరాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇప్పటికే సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో గుర్తించిన ఎస్‌డీ అన్‌మ్యాపింగ్ ఎర్రర్ ఎంట్రీలకు సంబంధించిన ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి, అవసరమైన సూచనలు, అభ్యంతరాలు తెలియజేయాలని కోరినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల సహకారంతో పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అందిన ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, అవసరమైతే విచారణ నిర్వహించి పారదర్శకంగా నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య, నాగర్ కర్నూల్ ఆర్డిఓ అర్చన, కొల్లాపూర్ ఆర్డీవో, బన్సీలాల్, అచ్చంపేట ఆర్డీవో యాదగిరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, డిటి కల్పన, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూ అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం



సమయం ప్రతినిధి : పేదల కోసం ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు భూ అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ మంత్రి వాకిటి శ్రీహరి ని మినిస్టర్ క్వార్టర్స్ లో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా cpim జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ జబ్బార్ మాట్లాడుతూ, అనేక పేద కుటుంబాలు స్వంత ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, స్థానికంగా ఇళ్ల స్థలాల కేటాయింపులో పారదర్శకత మరియు సమర్థత కొరవడిందని పేర్కొన్నారు. పేదలకు న్యాయంగా మరియు పారదర్శకంగా ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు ప్రత్యేకంగా "భూ అసైన్‌మెంట్ కమిటీ" ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల ఏలాంటి పారదర్శకత లేకుండా అందరికీ నాయ్యం జరగాలశిటే అసైన్మెంట్ కమిటీలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుండి ఒకరిని హ కమిటీ లో తీసుకోవాలని మంత్రి ని కోరారు. ఈ కమిటీ ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి త్వరితగతిన స్థలాలు కేటాయించే అవకాశం ఉంటుందని అన్నారు. ఉదాహరణకు అమరచింత మండల కేంద్రంలో గత 3సంవత్సరాలనుండి పేదలు గుడిసెలు వేసుకొని పోరాటం చేస్తున్నా కూడా అసైన్మెంట్ కమిటీ లేనందుకు పెండింగ్ లో ఉన్న పరిస్థితి కాబట్టి ఇలాంటి సమస్యలు పరిష్కారానికి కమిటీ ముఖ్యం అనేది మంత్రి కి వివరించారు. ఈ వినతి పత్రాన్ని స్వీకరించిన మంత్రి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో cpim జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు GS గోపి మండల కార్యదర్శివర్గ సభ్యులు టీ.రాఘవేంద్ర పాల్గొన్నారు.

## ఆడపిల్లల ఆరోగ్య మే మా లక్ష్యం



హెచ్ పి వి టీకాను వేసుకుందాం – క్యాన్సర్ ను దూరం చేద్దాం
వై.శైలజ శ్రీనివాస్ రెడ్డి గ్రామ సర్పంచ్ బిజ్వారం

సమయం ప్రతినిధి : జోగులాంబ గద్వాల జిల్లా సోమవారం మల్దకల్ మండలం బిజ్వారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి. మహేష్ అధ్యక్షతన ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ వై శైలజ శ్రీనివాస్ రెడ్డి,హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్,ఎంఎల్ హెచ్ పి మాట్లాడుతూ....14, 15 సంవత్సరాల వయసు నిండిన బాలికలికలు ప్రతి ఒక్కరు హెచ్ పి వి వ్యాక్సిన్ తప్పకుండగా వినియోగించుకోవాలని అన్నారు. ఈ యొక్క హెచ్ పి వి వ్యాక్సిన్ క్యాన్సర్ రోగానికి ఉపయోగపడుతుందని అన్నారు. గర్భాశయ ముఖద్వారం ద్వారా ఏర్పడే క్యాన్సర్ బారిన పడకుండగా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అందుకు ఈ టీకా వాడుకోవాలని అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక హెల్త్ సిబ్బంది, ఆశ వర్కర్లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇప్పుడు అదిలాబాద్ ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్

అదిలాబాద్ : ఏపీలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం కాగా, దీనిపై కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ ఇది తమ ఘనతేనని క్లెయిమ్ చేస్తున్నాయి. తమ హయాంలోనే దాదాపు ఎయిర్ పోర్ట్ పనులు పూర్తికాగా, సీఎం చంద్రబాబు ఫినిషింగ్ వర్క్స్ పూర్తి చేశారని వైసీపీ అంటోంది. తాము ఏది సాధించినా క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవడం వైసీపీకి అలవాటు అయిందంటూ కూటమి నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ విషయంలోనూ క్రెడిట్ గేమ్ మొదలైంది. సాధించింది తామేనని బీజేపీ నేతలు చెబుతంటే, బీజం వేసింది తానేనని, మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మంజూరు, పనులకు అనుమతులపై మాజీ ఎంపీ సోయం బాపూరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీనే అని, దానికి గతంలో బీజం వేసింది తానేనని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజరయ్యారు. ముందుగా గ్రామనికి చేరుకున్న నాయకులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం దిశా నిర్దేశం చేశారు.

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన కొత్తకోట నూతన ఎస్సై ఎం, విక్రమ్

**శాంతి, భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా విధులు నిర్వహించాలి**
**ప్రజల భద్రతే లక్ష్యంగా విధులు నిర్వహించాలి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**




కొత్తకోట, ఆగస్టు –03: కొత్తకోట పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎం. విక్రమ్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి,ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల సమస్యల పరిష్కారంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి చట్ట ప్రకారం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంపొందించేలా ప్రజల విశ్వాసాన్ని పొందే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎం. విక్రమ్ గతంలో మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ, తాజాగా బదిలీపై కొత్తకోట పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇంతకుముందు కొత్తకోట ఎస్సైగా పనిచేసిన శివానందం బదిలీపై వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై ఎం. విక్రమ్ మాట్లాడుతూ, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తానని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ పోలీసుశాఖకు సహకరించి నేరరహిత సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలని కోరారు.

## నెరవేరనున్న దశాబ్దాల కల... అమరచింతకు ఎస్ బి ఐ శాఖ మంజూరు



(సమయం ప్రతినిధి –అమరచింత) : అమరచింత మండల ప్రజల దశాబ్దాల కల నెరవేరుతున్న శుభవేళ స్థానికంగా ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. అమరచింతకు ఎస్.బి.ఐ (SBI) బ్యాంక్ మంజూరు కావడంలో కీలక పాత్ర పోషించిన మహబూబ్‌నగర్ (పాలమూరు) ఎంపీ శ్రీమతి డి.కె. అరుణ కి అమరచింత ప్రజలు, ప్రజాప్రతినిధులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. సోమవారం నాడు హైదరాబాద్‌లోని ఎస్.బి.ఐ పాలన భవనంలో (Administrative Office) బ్యాంక్ ఉన్నతాధికారులతో జరిపిన కీలక చర్చల అనంతరం, అమరచింతకు నూతన ఎస్.బి.ఐ బ్రాంచ్ మంజూరు చేస్తున్నట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఈ వార్తతో అమరచింత డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు, స్థానిక నాయకులు పాలన భవన ప్రాంగణంలోనే హర్షం వ్యక్తం చేస్తూ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.

**నాయకులకు సత్కారం – సంబరాలు**

అమరచింతకు ఎస్.బి.ఐ బ్యాంక్ సాధన కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులకు ఈ సందర్భంగా డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు ఘనంగా సన్మానం చేసి, మిఠాయిలు తినిపించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అమరచింత బీజేపీ అధ్యక్షురాలు డాక్టర్ లావణ్య కి, సీనియర్ నాయకులు మరాఠీ అశోక్ కి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కృషిని కొనియాడిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో అమరచింత డెవలప్‌మెంట్ ఫోరం సభ్యులు ఫిరోజ్ రాజ్, సత్యేందర్, కొంగరి భాస్కర్, నరసింహులు గౌడ్, విలేఖరి రఘు ఎస్. రవికుమార్ మాట్లాడుతూ... "గతంలో పలుమార్లు జరిపిన సర్వేలలో నెగటివ్ నివేదికలు వచ్చినా కూడా పట్టు వదలకుండా, ఎంపీ డి.కె. అరుణ దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రత్యేక చొరవ చూపడం జరిగింది. లక్ష్మీకాంత్ రెడ్డి , డాక్టర్ లావణ్య స్థానిక నాయకులు పదేపదే అధికారులను, ఎంపీ ని సంప్రదిస్తూ బ్యాంక్ మంజూరయ్యేలా చేసిన కృషి ప్రశంసనీయం." ఈ బ్యాంక్ మంజూరుతో అమరచింత మండల పరిధిలోని రైతులు, వర్తకులు, విద్యార్థులు మరియు సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలు సులభతరం కానున్నాయి.

## మక్తల్ పట్టణంలో వీధి కుక్కల సమస్యపై మున్సిపల్ అధికారులకు బిజెపి వినతిపత్రం



మక్తల్ : నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకు తీవ్రమవుతున్న వీధి కుక్కల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ, మున్సిపల్ చైర్‌పర్సన్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ విషయంపై ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ మేనేజర్ కి కూడా బీజేపీ మక్తల్ శాఖ టీం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించడం జరిగింది. గత నెల 29వ తేదీన పదిమందికి పైగా ప్రజలు వీధి కుక్కల దాడికి గురయ్యారు. వారిలో కొందరు నారాయణపేట జిల్లా ఆసుపత్రి లో, మరికొందరు మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో, ఒకరు రాయచూర్ ఆసుపత్రిలో చికిత్స పొందగా, మరికొందరు స్థానికంగా చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లారు. ఈ ఘటన జరిగిన రోజే మున్సిపల్ కమిషనర్ గారికి ఫోన్ ద్వారా సమాచారం అందించగా, కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మరుసటి రోజు ప్రత్యక్షంగా కలిసి విద్యార్థులపై కూడా వీధి కుక్కలు దాడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించి, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు చేపట్టలేదు. ప్రతిరోజూ ప్రజలు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు వీధి కుక్కల బారిన పడుతున్నారని, కౌన్సిల్ సమావేశం పేరుతో సమస్యను వాయిదా వేయడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉదయం పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లనున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. వీలైనంత త్వరగా వీధి కుక్కలను సురక్షిత ప్రదేశాలకు తరలించి, వాటికి అవసరమైన వైద్య చికిత్స అందించి, ప్రజలకు భరోసా కల్పించేలా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ప్రజల తరఫున బీజేపీ మక్తల్ శాఖ టీం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని, ఆ పరిస్థితికి పూర్తి బాధ్యత మున్సిపల్ యంత్రాంగానిదేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు: రాజశేఖర్ రెడ్డి, పీకే నరసింహ, తప్ప కృష్ణ. బీజేపీ నాయకులు, కార్యకర్తలు: బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బి. భరత్, బ్యాటరీ రాజు, మహేష్ సాగర్, శ్రీకాంత్, మంజునాథ్, ఆంజనేయులు, నవీన్, జావిద్, అశోక్, గోవిందు, భీమేష్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

## టీటీడీ ఫేక్ వెబ్‌సైట్ కలకలం..!

తిరుమల : కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి దర్శనం కోసం వేచి చూసే అమాయక భక్తులను టార్గెట్ చేస్తూ సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. తిరుమల తిరుపతి దేవస్థానం పేరుతో సరికొత్తగా ఒక నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. 'బిబిటటవలజీబబిష్ట్రజీనిజీఎ.నీనిశ్రీతినివ' అనే పేరుతో చలామణి అవుతున్న ఈ నకిలీ వెబ్‌సైట్ వ్యవహారం ప్రస్తుతం భక్తులలో తీవ్ర కలకలం రేపుతోంది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ఏ విధంగా ఉంటుందో, అచ్చం అదే తరహా డిజైన్, రంగులు మరియు ఫోటోలను ఉపయోగించి సైబర్ కేటుగాళ్లు ఈ నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించడం గమనార్హం. ఈ నకిలీ వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం , వివిధ రకాల సేవా టికెట్లు మరియు తిరుమలలో వసతి గదుల బుకింగ్స్ పేరుతో భక్తులను నమ్మించి మోసగించడానికి నేరగాళ్లు ప్రయత్నిస్తున్నారు. టీటీడీ అధికారిక కోటా విడుదల కాని సమయంలో కూడా ఈ సైట్‌లో టికెట్లు అందుబాటులో ఉన్నట్లు చూపిస్తూ భక్తుల నుండి భారీగా డబ్బులు వసూలు చేసేందుకు వల విసిరారు.

# జవాబుదారీతనం సమన్వయంతో అధికారులు పనిచేయాలి








దేవరకద్ర : మదనపురం మండల జనరల్ బాడీ సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ.జి. మధుసూదన్ రెడ్డి (GMR) పాల్గొన్నారు. మదనపురం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య (జనరల్ బాడీ) సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (GMR) పాల్గొని, అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, పశు సంవర్ధక, ఆర్అండ్‌బీ, ఉద్యానవన, ఎక్సైజ్, ఇరిగేషన్, ఫారెస్ట్, వెటర్నరీ తదితర అన్ని శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని సమావేశంలో వివరించారు, అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో చేస్తూ, ప్రభుత్వ పథకాల సంబంధించి సర్పంచులతో చర్చించి, సమన్వయంతో పని చేయాలి. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలి. అన్ని శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి. రెవెన్యూ శాఖ భూ సమస్యలు, ప్రజల దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఎంతగానో మెరుగుపరిచింది, తద్వారా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్స్ పెరిగాయి. ఉపాధి హామీ పథకంకు సంబంధించి, నూతన VB-G RAM G పనులపై అధికారులు సర్పంచ్‌లకు అవగాహన కల్పించాలి. సర్పంచ్‌లతో చర్చించి, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలి. నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ కు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలి, రాబోయే సీజన్ ను దృష్టిలో ఉంచుకుని, మెడిసిన్ (డ్రగ్స్)ను అందుబాటులో పెట్టుకోవాలి. రైతులకు నాణ్యమైన

## -మండల సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సూచన

విద్యుత్ సరఫరా అందించాలి, త్వరలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్, AB స్విచ్లు, పోల్స్ తదితర విద్యుత్ ఉపకరణాలు వస్తున్నాయి మండలాల వారిగా కార్యక్రమం నిర్వహిస్తాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. పశువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా అందించాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాలు, మండల కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించాలి. రోడ్లు, భవనాల నిర్మాణ పనులను, నిర్ణీత గడువులో పూర్తి చేయించేలా అధికారులు కృషి చేయాలి. ఉద్యానవన పంటలను ప్రోత్సహించి, రైతులకు ఉద్యానవన పంటల గురించి అవగాహన కల్పించి, ఉద్యాన పంటల సాగును మరింతగా పెంచేలా హార్టికల్చర్ అధికారులు పనిచేయాలి.విద్య, వైద్యం, ఇరిగేషన్ శాఖలపై ప్రత్యేక దృష్టి పెట్టి మన ప్రభుత్వం పని చేస్తుంది.మదనపురం మండలంలో 90% ఇండ్లకు గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్ ఇస్తున్నం.గత ప్రభుత్వం మదనపురం మండలంలోని సరళసాగర్, నెల్విడి, కూరుమూర్తి రాయ ఎత్తిపోతల పథకాలను పట్టించుకోలే, మన ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల మరమ్మత్తుల కోసం 5 కోట్లు మంజూరు చేసింది.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే జియంఆర్ గారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# నీట్ సాధకులు సన్మానించిన గుజరాత్వాసి





అమరచింత : నీట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం నాడు సన్మానించిన అమరచింత నివాసి సయ్యద్ ఫారూక్ గుజరాత్ ప్రాజెక్ట్ (బి ఒ.డి ).లో అసిస్టెంట్ జనరల్ మే నేజర్ .సూచన మేరకు. ఆయన గుజరాత్ లో ఉన్నప్పటికీ స్పందించి ఈ సన్మానం చేయించారు. భవిష్యత్తులోతను స్వచ్ఛంద సంస్థ ద్వారా పెద విద్యా ర్థులను ఆదు కొనేందుకు సేవ కార్యక్రమాలను చేపడతానని పేర్కొన్నారు కో ఆప్షన్ సభ్యులు యస్. అజయ్.. ఎమ్ డి. ఆన్సర్. షేక్ పాషా. కె. వెంకట స్వామి లు మాట్లాడుతు.ఇటీవల వెలువడిన2026 నీట్ ఫలితాల్లో అమరచింత మున్సిపాలిటీకి చెందిన . ఖాజా హుస్సేన్ కూతురు బి.నుజ హాత్ 555.మహిముద్.కూతురు ఆఫీఫా నౌసీన్ 440.యస్. శ్రీనివాసులు కొడుకు యస్.జగన్ 441. మార్కులు సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ సన్మానించడం జరిగింది . నీట్ లో ఉత్తమ ఫలితాలు సాధించడం అమరచింత పట్టణశీ కు గర్వకారణం అని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. భవిష్యత్తులో డాక్టర్లుగా రాణించి పేదలకు మెరుగైన వైద్యం అందించే దిశగా వారు కృషి చేయాలని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. బీడీ కార్మిక పేద కుటుంబాలకు చెందిన కుటుంబాల నుంచి వచ్చిన విద్యా ర్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడం పట్ల వారిని అభినందించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ డిక్లరేషన్ హామీల అమలులో విఫలం: డి హెచ్ పి ఎస్




వనపర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ హామీల అమలులో విఫలమైందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ల వద్ద ధర్నా, వినతి పత్రాలు సమర్పించాలన్న రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి కలెక్టర్ ఆఫీస్ లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దళితులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల ముందు చేవెళ్లలో ఎస్సీ డిక్లరేషన్ ఇచ్చి మూడేళ్లు కావస్తున్న ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. దళితుల సమగ్ర అభివృద్ధికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని, అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు కల్పించాలని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు ప్రాధాన్య ఇవ్వాలని, ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఇండస్ట్రియల్ రుణాలకు, సబ్సిడీని వెంటనే విడుదల చేయాలన్నారు. దళితులు సాగు చేస్తున్న పోడు భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని ఎస్సీ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వంపై పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. డిహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు డి. శేఖర్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సెల్ సభ్యుడు విశ్వం బాబు,మాజీ సర్పంచ్ శాంతన్న,సామాజిక నేత గంధం నాగరాజు,చిన్న కురుమన్న, రమేష్,వంశీ,సౌలు,రవి,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పరారీలో వైసీపీ నేతలు

ఏలూరు, గుంటూరు : ఆంధ్రప్రదేశ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుంటే.. వైఎస్సార్‌సీపీ నేతలలో కనిపిస్తున్న భయం, ఆందోళన రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిపోయి కేసులు మూటగట్టుకున్న నాయకులు.. ఇప్పుడు విచారణను ఎదుర్కొనే ధైర్యం లేక చాంతాడంత పొడవునా పరారీలో ఉంటున్నారు. ఎక్కువ మంది కొత్త కేసుల్లోనే ఇరుక్కుంటున్నారు. కనిపించకుండా పోతున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు మద్యం రవాణా టెండర్ల అక్రమాల కేసులో సుప్రీంకోర్టు నుంచి ముందస్తు బెయిల్ రాక తీవ్ర షాక్ తగలడం, చింతాడ రవికుమార్, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా వంటి వారు ఎక్కడ ఉన్నారో తెలియక అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం ఈ సిరీస్‌లో తాజా పరిణామాలు. తమ్మినేని వంటి కొందరు నేతలు అత్యంత ప్రయాస పడి మధ్యంతర బెయిల్ తెచ్చుకుంటుంటే.. మిగిలిన వారంతా పోలీసుల భయంతో దిక్కుతోచని స్థితిలో నక్కి నక్కి బతుకుతున్నారు.అసలు ఇక్కడ విచిత్రమేమిటంటే.. పోలీసులు వీరిని అరెస్ట్ చేయడానికి పెద్దగా ప్రత్యేక వేట ఏమీ సాగించడం లేదు. అయినప్పటికీ, తమ అక్రమాలు ఎక్కడ వెలుగులోకి వస్తాయోనన్న భయంతో ఫోన్లు కూడా వాడకుండా, రహస్య స్థావరాల్లో దాక్కుంటూ నేతలే సొంతంగా నరకం అనుభవిస్తున్నారు. ఈ ఆధునిక డిజిటల్ యుగంలో ఫోన్ లేకుండా, పరివారానికి దూరంగా, నిరంతరం పోలీసుల సైరన్ వినపడితే ఉలిక్కిపడుతూ అజ్ఞాతంలో గడపడం ఏ రాజకీయ నాయకుడికైనా తీవ్రమైన మానసిక వేదన. ముందస్తు బెయిల్ ఇప్పించాలంటూ కోర్టుల చుట్టూ లాయర్లతో పిటిషన్లు వేయిస్తూ, రోజులు లెక్కిస్తూ బతకడం కంటే పెద్ద శిక్ష మరొకటి ఉండదు.వైసీపీ నాయకత్వం గానీ, ఈ పరారీలో ఉన్న నేతలు గానీ అర్థం చేసుకోవాల్సిన ప్రధానమైన అంశం ఒకటుంది. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో నిందితులు ఎంతకాలం పారిపోగలరు.

## ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరుతో మోసాలకు పాల్పడే వారిని నమ్మవద్దు

**– లైసెన్స్‌లు, శిక్షణ కోసం శాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలి: జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్**

రంగారెడ్డి, ఆగస్టు 3 (సమయం ప్రతినిధి): ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరుతో కొందరు వ్యక్తులు వ్యాపారులను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్ హెచ్చరించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆహార భద్రత తనిఖీలు కొనసాగుతున్న వేళ ఇలాంటి మోసాలపై వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "శిక్షణ ధ్రువపత్రాలు ఇప్పిస్తాం", "ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లు ఇప్పిస్తాం" అంటూ కొందరు డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. అలాంటి వ్యక్తులను నమ్మవద్దని, వారికి ఎలాంటి నగదు చెల్లించవద్దని సూచించారు.ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు, శిక్షణ కార్యక్రమాలు, ఇతర అధికారిక సేవలకు సంబంధించిన సమాచారం కోసం నేరుగా జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలని కోరారు. అన్ని సేవలు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అందించబడతాయని స్పష్టం చేశారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా మోసాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖకు తెలియజేయాలని, వ్యాపారులు అప్రమత్తంగా ఉండి మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రస్థాయిలో బిజ్వారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదాం



**గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అనునిత్యం కృషి**
**గ్రామ అభివృద్ధికై గ్రామసభలో పలు అంశాలపై తీర్మానించిన గ్రామ సర్పంచ్,వార్డ్ మెంబర్‌లు**
**వై.శైలజా శ్రీనివాస్ రెడ్డి**

సమయం ప్రతినిధి : జోగులాంబ గద్వాల జిల్లా సోమవారం మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభ సమావేశానికి గ్రామ సర్పంచ్ వై.శైలజ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... బిజ్వారం గ్రామాన్ని రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ భారత్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రజలు సహకరించాలని అన్నారు. ముఖ్యంగా ప్రధాన కూడలిలో చెత్తచెదారం లేకుండా పరిశుభ్రతను పాటించాలని చూపించారు. డ్రైనేజీ కాలువలలో చెత్త చెదారం వేయడం వల్ల విష జ్వరాలు ప్రబలించే అవకాశం ఉందని అన్నారు. ఇళ్ళ ముందు మురికి నీరు నిలువ ఉండకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ పూర్తిస్థాయిలో ప్రతి ఇంటికి అందెందుకు నా వంతుగా కృషి చేస్తానని అన్నారు.వీధులలో గ్రామ ప్రజలకు ఎవరికి ఏ సమస్య వచ్చినా ఎల్లవేళలా పరిష్కరించి కృషి చేసేందుకు నా వంతుగా సహకరిస్తారని అన్నారు. గ్రామ అభివృద్ధికై ప్రతి ఒక్కరం సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చాపకండ్ల కర్రెన్న,పంచాయతీ కార్యదర్శి,జిపిఓ వార్డు మెంబర్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్,అగ్రికల్చర్ ఏఈఓ, అంగన్వాడి టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రేవంత్ బాటలో డీకే...

బెంగళూరు : ఎన్నికల సమయంలో వేసే రాజకీయ ఎత్తుగడలు, విమర్శలు వేరని.. రాష్ట్ర అభివృద్ధి, పరి పాలన విషయానికి వచ్చేసరికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడమే నిజమైన రాజధర్మమని కర్ణాటక ముఖ్య మంత్రి డి.కె. శివకుమార్ నిరూపించారు. శనివారం మైసూరులోని రామకృష్ణ విద్యాలయ ప్రాంగణంలో ప్రతిష్టాత్మక వివేకనంద స్మారక యూత్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీతో వేదిక పంచుకున్న డికేఎస్, సభాముఖంగా ప్రధానిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా వైరల్ అయ్యాయి."మా ప్రధాని మోదీ ఈ చారిత్రాత్మక వేడుకకు రావడం చాలా గర్వకారణం" అని కొనియాడారు. "రాష్ట్ర అభివృద్ధి విషయంలో మొత్తం కర్ణాటక మీతో నిలబడుతుంది. మనం అంతా కలిసి పనిచేద్దాం. కర్ణాటక అభివృద్ధి చెందితేనే దేశం కూడా వృద్ధి చెందుతుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కర్ణాటకకు విశాల హృదయంతో సహాయం అందించి, ఆదుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నాను" అని వ్యాఖ్యానించారు.

# ప్రజావాణిలో 56 వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్

## హేమంత కేశవ్ పాటిల్, అర్జీలను సత్వరమే పరిష్కరించాలి, సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశం

నాగర్ కర్నూల్, సమయం ప్రతినిధి 03 : జిల్లా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఈ వారం మొత్తం 56 వినతిపత్రాలు అందాయని ప్రజావాణి అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రజల నుంచి స్వయంగా దరఖాస్తులను స్వీకరించి, ఒక్కో అర్జీదారుడి సమస్యను ఓపికగా విని, సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని వివిధ మండలాల పరిధిలోని గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలు, సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, అర్హత మేరకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం సహించబోమని హెచ్చరించారు. ప్రజావాణిలో అందిన అర్జీలపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించి, పెండింగ్ లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. జిల్లాలోని






అన్ని శాఖల అధికారులు తమ సిబ్బందిని జిల్లా రెడ్ క్రాస్ సంస్థలో సభ్యత్వం నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయం, డిఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

## దేవరకొండలో (ఎం జి) ఎలక్ట్రికల్ స్కూటీ షాప్‌ను ప్రారంభించిన దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్రకుమార్



దేవరకొండ: ఆగస్టు 3 ( సమయం ప్రతినిధి) : దేవరకొండ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన (ఎం జి )ఎలక్ట్రికల్ స్కూటీ షాప్‌ను దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతోందని అన్నారు. ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో ఎలక్ట్రిక్ స్కూటీలు ప్రజలకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉండటమే కాకుండా, కాలుష్యాన్ని తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. దేవరకొండలో ఇటువంటి ఆధునిక సేవలు అందుబాటులోకి రావడం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి, వ్యాపార రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొట్ట మురళి, పొట్ట మధు, సర్పంచ్ ఆడారపు హరిక్రిష్ణ,బొడ్డుపల్లి కృష్ణ ,ఇలియాస్ పటేల్,మాడం రాములు, ముదిగొండ హరిదాస్, అఫ్రోజ్, అంజి, శ్రీనివాస్,యజమానులు గండూరి లక్ష్మణ్,సాగర్,పార్టీ నాయకులు యువకులు పాల్గొన్నారు.

## కాక్రోచ్ తరహాలో క్రిమినల్ వేస్ట్ పార్టీ?

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగార్హతలు, స్కిల్స్ లోపంపై మాట్లాడుతూ చేసిన క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర తుఫాను రేపాయి. ఏటా 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నా కనీసం ఒక ఉద్యోగ దరఖాస్తు కూడా సొంతంగా నింపలేకపోతున్నారని, ఇది విద్యావ్యవస్థ పరిధిలో క్రిమినల్ వేస్ట్ అని ఆయన వ్యాఖ్యానించడం విమర్శలకు దారితీసింది. ఈ కామెంట్లపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ తో పాటు బీజేపీ నేత ఈటల రాజేందర్ వంటి వారు యువతను కించపర్చారని రేవంత్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. సీఎం వెంటనే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొఫెషనల్ అర్హతలు, కనీస పోటీ పరీక్ష రాసిన అనుభవం లేని సీఎం యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపిస్తూ, జెన్–జీ యువత , ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ వ్యాఖ్యలపై తిరగబడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. డిజిటల్ మాధ్యమాల్లో రేవంత్ వ్యాఖ్యలపై విద్యార్థుల నిరసనను ఒక రాజకీయ ఉద్యమంగా మార్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ సోషల్ మీడియా విభాగాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.తాజాగా సోషల్ మీడియాలో కాక్రోచ్ అనే పదాన్ని ఒక విమర్శగా ఉపయోగించినప్పుడు, దాన్ని ప్రతిఘటిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో, సరిగ్గా అలాగే ఇప్పుడు రేవంత్ వ్యాఖ్యలను రీ–బ్రాండ్ చేస్తూ క్రిమినల్ వేస్ట్ అనే ట్యాగ్‌ను విద్యార్థులు ఒక నిరసన చిహ్నంగా మలుచునేలా చేసేందుకు రాజకీయ పార్టీలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. మేము క్రిమినల్ వేస్ట్ కాము.. నవ తెలంగాణ నిర్మాతలము అనే హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్‌లు, షార్ట్ వీడియోలతో జెన్–జీ తీవ్రస్థాయిలో రీ–కౌంటర్లు ఇస్తోంది. ఈ భావోద్వేగాన్ని ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోవడానికి క్రిమినల్ వేస్టే పార్టీ పెట్టేలా యువజన సమూహాలను ఆన్‌లైన్ వేదికగా ప్రోత్సహించేందుకు సిద్ధమవుతున్నాయి.భారత రాజకీయాల్లో ముఖ్యంగా పొలిటికల్ మీమ్‌లతో ఆడుకునే ప్రస్తుత జెన్–జీ తరం ఎప్పటికప్పుడు సరికొత్త నెరేటివ్‌లను సృష్టిస్తుంది. ఒక వివాదాస్పద పదాన్ని పట్టుకుని దాన్నే ఒక ఐడెంటిటీగా మార్చుకోవడం గ్లోబల్ డిజిటల్ ట్రెండ్. గతంలో కేటీఆర్, ఇతర నేతలు ఉపయోగించిన పదాలను కాంగ్రెస్ ట్రోల్ చేయగా, ఇప్పుడు కాంగ్రెస్ సీఎం వ్యాఖ్యలను బీఆర్ఎస్ అస్త్రంగా మార్చుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై విద్యార్థులు ఆత్మగౌరవ నిరసనలు తెలుపడానికి ప్రతిపక్ష పార్టీలు వెనకుండి బ్యాకింగ్, టెక్నికల్ సపోర్ట్, ట్రెండింగ్ ప్రోత్సాహాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.

## అందుబాటులోకి తొలి ప్రైవేట్ ఆయిల్ పామ్

ఖమ్మం : తెలంగాణలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ఖమ్మం జిల్లా అంజనాపురంలో ఈ నెల 20న ప్రారంభం కానుంది. గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ రూ.300 కోట్ల పెట్టుబడితో 113.5 ఎకరాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. మలేసియా భాగస్వామ్యంతో దేశంలోనే తలమానికంగా నిలిచే సీడ్ గార్డెన్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మరో ఆరు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రముఖ గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని అంజనాపురం గ్రామపంచాయతీలో ఈ మెగా ప్రాజెక్టును నిర్మించింది. దాదాపు రూ.300 కోట్ల భారీ పెట్టుబడితో 113.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ సమీకృత పరిశ్రమను ఈ నెల 20న ప్రారంభించేందుకు సంస్థ సర్వ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సంస్థ ప్రతినిధులు ఇప్పటికే ఆహ్వానించారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 700 మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

## ఆయిల్ ఫామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం అందించే లాభదాయక పంట - ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ : చింతపల్లి: ఆగస్టు 3 (సమయం ప్రతినిధి) :నల్లగొండ జిల్లా ఉద్యానవన (హార్టికల్చర్) శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా చింతపల్లి మండలం గడియ గౌరారం ఃశ రోడ్ వద్ద రైతు అల్వాల యాదయ్య పొలంలో ఆయిల్ ఫామ్ మొక్కలను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సంబంధిత అధికారులతో కలిసి నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఆయిల్ ఫామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తోందన్నారు. వంటనూనెల దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించడంతో పాటు రైతులకు స్థిరమైన, అధిక ఆదాయాన్ని అందించే పంటగా ఆయిల్ ఫామ్ నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలం పాటు నిరంతర ఆదాయం లభిస్తుందని, మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. నాణ్యమైన మొక్కల పంపిణీ, సాంకేతిక సలహాలు, సాగు నిర్వహణలో అవసరమైన మార్గదర్శకాలను ఉద్యానవన శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్నదని చెప్పారు. నీటి వనరులు ఉన్న రైతులు ఆయిల్ ఫామ్ సాగు వైపు మొగ్గు చూపితే భవిష్యత్తులో ఆర్థికంగా మరింత బలపడతారని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటూనే, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, సాగునీటి సౌకర్యాల మెరుగుదల, వ్యవసాయానికి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో కూడా వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే సంప్రదాయ




పంటలతో పాటు మార్కెట్ అవకాశాలు ఉన్న ప్రత్యామ్నాయ పంటలను కూడా రైతులు సాగు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో కలిసి మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల గిరి, చింతపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటావత్ హరినాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న జైల్ బరోను జయప్రదం చేయండి





### కార్మిక రైతు వ్యవసాయకార్మిక సంఘాల పిలుపు

అమరచింత : అమరచింత మండలకేంద్రంలోని జి యస్. భవనశీ లో మండలసదస్సు. ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. అనంతరం. సి ఐ టి యు జిల్లా అధ్యక్షులు. ఆ ర్. ఎన్. రమేష్. వ్యవసాయకార్మిక సంఘశీ జిల్లా అధ్యక్షులు యస్. అజయ్. రైతు సంఘశీ జిల్లా కోశాధికారి బి. వెంకటేష్ లు మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జరుగు కార్యక్రమాన్ని వరంగల్ జిల్లాలో కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలను వేలాదిగా సమీకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం సామ్రాజవాద విధానాలను విరమిశీ చు కోనట్లైతే రైతాంగం అగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కుదించి పారిశ్రామిక యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడులుగా తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసి జి రామ్ జి పేరుతోని కేంద్ర ప్రయోజిత పథకం తీసుకురావడం గ్రామీణ పేదల పొట్ట కొట్టడమేనని ఆయన విమర్శించారు. దేశంలోని ఘనులు, అడవులు, ప్రకృతి వనరులను ఇప్పటికే కార్పొరేట్ శక్తులకు పెద్ద ఎత్తున కట్టబెట్టారు. విద్యుత్తును కూడా ఆదానీ, అంబానీ లాంటి పారిశ్రామికవేత్తలకు అప్పజెప్పే కుట్రలో భాగంగానే విద్యుత్ బిల్లును తీసుకొచ్చాడని ఆయన విమర్శించారు. పేదలకు రైతాంగానికి మొత్తం రాష్ట్ర ప్రయోజనాలకే విఘాతం కలిగించే విద్యుత్ బిల్లును వ్యతిరేకించవలసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రం అడుగులకు మడుగులొత్తడానికి పూనుకొని విద్యుత్ బిల్లును రాష్ట్రంలో అమలు చేయడం కోసశీ ప్రయత్నం చేస్తున్నాడని అందులో భాగమే రాష్ట్రంలో మూడవ డిస్కం తీసుకొస్తున్నాడని అన్నారు. ఈ ప్రజా వ్యతిరేకమైన విధానాలకు వ్యతిరేకంగా పట్టణ కార్మికులు, గ్రామీణ రైతు వ్యవసాయ కూలీలు సంఘటితంగా ఉద్యమాలు కొనసాగించాలని అందులో భాగమే ఆగస్టు 10న జైలు నింపే కార్యక్రమాన్ని మూడు సంఘాలు చేపట్టాయని ఈ కార్యక్రమాన్ని మూడు సంఘాల కార్యకర్తలు సవాల్గా స్వీకరించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్ని సమీకరించాలని ప్రభుత్వం మెడల్వంచైనా ఈ విధానాలను వెనక్కి తీసుకునే విధంగా ఉద్యమాలు పెంపొందించాలనికోరారు.ఈ కార్యక్రమం లో ఏ. బుచ్చన్న. నాగేంద్రమ్మ.ఖ.శంకర్. చీ. రాజు. మోహన్.. కుర్వ కాకి శ్రీను.మహేష్.భగవంతు. హరికృష్ణ. రేణుక లత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తో కటీఫ్... మల్లన్న యాక్షన్ ప్లాన్ రెడీ

హైదరాబాద్ : చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఇప్పుడు తన రాజకీయ ప్రయాణంలో అత్యంత కీలకమైన సవాలును ఎదుర్కొంటున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం ఆ పార్టీతో తెగదెంపలు చేసుకుని సొంత రాజకీయం మొదలుపెట్టారు. వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న తన పదవీకాలం ముగిసేలోపు మళ్లీ అదే స్థానం నుంచి స్వతంత్ర వేదిక ద్వారా గెలవాలనే లక్ష్యంతో సుదీర్ఘ పాదయాత్రకు రూపకల్పన చేస్తున్నారు. ఈ కొత్త నిర్ణయం ఆయన భవిష్యత్తును పూర్తిగా మార్చే అవకాశం ఉంది.గతానికి ఇప్పటికి మల్లన్న పొలిటికల్ ఇమేజ్‌లో చాలా స్పష్టమైన మార్పు వచ్చింది. ఒకప్పుడు తీన్మార్ మల్లన్న అంటే డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వాలను అక్రమాలను ప్రశ్నించే హార్డ్‌కోర్ వాయిస్‌గా యూత్‌లో విశేషమైన ఆదరణ ఉండేది. ఆ ప్లాట్‌ఫామ్ తెచ్చిపెట్టిన క్రేజ్‌తోనే ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడే లక్షలాది ఓట్లు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తదనంతరం కాంగ్రెస్‌లో చేరి ప్రత్యర్థులను తట్టుకుని ఎమ్మెల్సీ పీఠాన్ని అధిరోహించగలిగారు. కానీ కాలక్రమేణా ఆయన అనుసరించిన విధానాలు మారడంతో ప్రజల్లో ఆయనపై ఉన్న సానుకూల దృక్పథం నెమ్మదిగా కరిగిపోతూ వచ్చింది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన ఎంచుకున్న రాజకీయ దారి ఆయన పునాదులనే కదిలించిందనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.



# రామదూత... అభయదాత

**శ్రీరాముని కథలో హనుమంతుడిది చాలా విశిష్టమైన పాత్ర. రాముని దాసుడైన హనుమంతుడు భక్తికి, శక్తికి ప్రతీకగా నిలుస్తాడు. వారిద్దరి మధ్య ఉన్న బంధం... భగవంతుడికి, భక్తుడికి మధ్య ఉండే అవినాభావ సంబంధాన్ని తెలియజేస్తుంది. శ్రీరాముడికోసం కొండనైనా ఎత్తి తీసుకురాగలిగే శక్తి హనుమంతుడిది. హనుమంతుడికి ఇచ్చిన వరం కోసం... అతను చిటికెలు వేస్తున్నంతసేపు ఆవలింతలు తీసేంత ప్రేమ శ్రీరాముడిది. ఈ బంధం మన దేశ పౌరాణిక గాథలలో చిరస్థాయిగా నిలిచిపోయింది.**

### వినయశీలి...


శ్రీరాముడి పట్ల హనుమంతుడి భక్తి ఎంత గొప్పదంటే... ఒకసారి సీతాదేవి ఒక ముత్యాలహారాన్ని హనుమంతుడికి బహుమతిగా ఇచ్చింది. ఆ హారంలో ఉన్న ముత్యాలను ఒక్కటొక్కటిగా బయటకు తీసి చూసి "ఇందులో రాముడు లేడు. దీన్ని నేనేం చేసుకుంటాను?" అన్నాడు హనుమంతుడు. "మరి రాముడు ఎక్కడ ఉన్నాడు?" అని అడిగింది సీతాదేవి. "ఇదిగో... రాముడు ఇక్కడ ఉన్నాడు" అంటూ తన గుండెను చీల్చి చూపించాడు హనుమంతుడు. మన సూక్ష్మ శరీరంలో శ్రీరాముడి స్థానం కుడివైపు హృదయ చక్రంలో ఉంటుంది. ఎవరైతే శ్రీరాముని గుణాలను తమ దైనందిన జీవితంలో ఆచరిస్తూ, ఆదర్శవంతమైన జీవనాన్ని కొనసాగిస్తారో... వారి హృదయ చక్రంలో శ్రీరాముడు కొలువై ఉంటాడు. అహంకారాన్ని వారి దరి చేరనివ్వడు. దీనికి ఉదాహరణ హనుమంతుడే. ఆయన ఎంత క్రియాశీలత కలిగి చురుగ్గా పనులు చేస్తూ ఉంటాడో... అంతటి వినయ విధేయతలు కూడా కలిగి ఉంటాడు. మనం కూడా పనులు ఎక్కువగా చేసేకొద్దీ... వినయవిధేయతలు కలిగి ఉంటేనే సమతుల్యతతో ఉండడం సాధ్యమని తెలుసుకుంటాం. ఎప్పుడైతే మన ద్వారా జరుగుతున్న పనులన్నీ మనమే చేసేస్తున్నామనే భ్రమలో చిక్కుకుంటామో.... అప్పుడు అహంకారం బారిన పడతాం. మన ద్వారా జరుగుతున్న పనులన్నిటినీ ఆ భగవంతుని శక్తే జరిపిస్తున్నదనే విషయం తెలుసుకొని, వినమ్రతను కలిగి ఉంటే... భగవంతుడి శక్తికి చక్కని వాహకాలుగా మారుతాం. మరిన్ని మంచి పనులు చేయగలుగుతాం.

### భజే వాయువేగం...

హనుమంతుడి నుంచి మనం నేర్చుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే... ఆయన ఏ పనినైనా చాలా వేగంగా చేస్తాడు. ఆయనది వాయువేగం. రాముడు తన సందేశాన్ని సీతాదేవికి పంపాలనుకున్నప్పుడు... తన ఉంగరాన్ని హనుమంతుడికి ఇచ్చి పంపిస్తాడు. ఎందుకంటే ఆ పనిని హనుమంతుడు చేయగలిగేంత వేగంగా శ్రీరాముడు చేయలేడు. అలాగే, సంజీవనీ మూలిక అవసరమైనప్పుడు.... అది ఒక ప్రత్యేకమైన పర్వతం మీద ఉంటుందని చెప్పి, దాన్ని తీసుకురావాలని హనుమంతుణ్ణి పంపించాడు శ్రీరాముడు. అక్కడికి వెళ్ళిన హనుమంతుడు ఆ మూలికకోసం వెతుకుతూ సమయం వృధా చేయడం ఎందుకని... మొత్తం పర్వతాన్నే తీసుకువచ్చేశాడు. ఏ పని చేసినా వెంటనే చేయడం, వేగంగా చేయడం, సమయాన్ని వృధా కానివ్వకపోవడం హనుమంతుడి లక్షణం. హనుమంతుడి ఆశీస్సులు పొందినవారికి 'సత్-అసత్ వివేక బుద్ధి' లభిస్తుంది. అంటే 'ఏది సత్యం? ఏది అసత్యం?' అని తెలుసుకోగలిగే వివేకం కలుగుతుంది. 'ఏది మంచి? ఏది చెడు?' అనే విచక్షణ కలిగిన మనిషి చెడు నుంచి దూరంగా ఉంటాడు, తనను తాను రక్షించుకోగలుగుతాడు. సన్మార్గంలో నడిచి ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందుతాడు. హనుమంతుడి గుణాలైన వినయ విధేయతలను, భక్తితో కూడిన శక్తిని దైనందిన జీవితంలో మనం కూడా అలవరచుకుంటే ఆయన అనుగ్రహాన్ని, శ్రీరాముడి కృపా కటాక్షాలను నిరంతరం పొందగలం. మానవుల సూక్ష్మ శరీరంలోని పింగళా నాడి మొత్తాన్ని హనుమంతుడు ప్రభావితం చేస్తాడు. పింగళా నాడికే 'సూర్య నాడి' అనే మరో పేరు ఉంది. ఇది మానవులకు క్రియాశక్తిని ప్రసాదిస్తుంది. అంటే మానవులకు పనులు చేయడానికి కావలసిన శక్తి ఈ నాడి నుంచే లభిస్తుంది. కానీ పనులు ఎక్కువగా చేస్తూ, విశ్రాంతి తీసుకోవడం మరచిపోయినప్పుడు... ఆ నాడిలో వేడి ఎక్కువై అనేక రకాల వ్యాధులకు దారి తీస్తుంది. మానవుల పింగళా నాడి మీద తాను పనిచేసి, అక్కడ అధికంగా ఉండే సూర్యతాపం నుంచి వారిని రక్షించి, చల్లదనాన్ని ప్రసాదించడం తన బాధ్యత అని హనుమంతుడికి ఆయన జన్మించే సమయానికే తెలుసు. అందుకే బాల్యంలోనే సూర్యుణ్ణి మింగెయ్యడానికి ప్రయత్నించాడు. దేవతలు ప్రార్థించడంతో... సూర్యుణ్ణి విడిచిపెట్టాడు.

---

ఒక వ్యక్తి శారీరకమైన అవయవానికి కార్డియాలజిస్టుగా చికిత్స చేస్తూ ఉంటాను. అదే సమయంలో... ఆ వ్యక్తి హృదయంలోని నిశ్శబ్దమైన అరల్లో సూక్ష్మమైన, నిరంతరమైన సంభాషణ ఒకటి కొనసాగుతూ ఉంటుంది. అది స్కెతస్కోపులో వినిపించదు. ఈసీజీలో కనిపించదు. అయినప్పటికీ అది మన జీవితాల గమనాన్ని నిర్దేశిస్తూ ఉంటుంది. ఈ సంభాషణ భారతీయ తత్త్వశాస్త్రంలో లోతుగా వర్ణించిన రెండు పురాతనమైన శక్తుల మధ్య జరుగుతుంది. అవి: శ్రేయస్సు, ప్రేయస్సు. శ్రేయస్సు అంటే హితమైనది, మనకు మంచి చేసేది, మన ఉన్నతికి దోహదం చేసేది. ప్రేయస్సు అంటే ప్రియమైనది. అది ఇంద్రియ సంతృప్తి, సౌకర్యం, స్వల్పకాలిక తృప్తి లాంటివాటికి... అంటే తాత్కాలికమైన సుఖాన్ని అందించేవాటికి ప్రతీక. అది మనలోని ఆవేశాలను, కోరికలను, తరచుగా మన బలహీనతలను ప్రేరేపిస్తుంది. ఈ వైరుధ్యాన్ని 'కఠోపనిషత్తు'లో ఋషులు చక్కటి స్పష్టతతో వివరించారు.



# హితమా? ప్రియమా?

### అది ఒక సంస్కృతి

మరొకవైపు శ్రేయస్సు ఉన్నతమైన మేలుకు మార్గం. తక్షణమే అది సులభం కాకపోవచ్చు. కానీ ఎదుగుదలకు, అంతర్గతమైన పరిశుద్ధతకు, అంతిమంగా మోక్షానికి దారి తీసే ఎంపిక. నేటి వేగవంతమైన ప్రపంచంలో, ప్రేయస్సు తాలూకు ఆకర్షణ ఇదివరకటికన్నా బలంగా మారింది. తక్షణం పొందే తృప్తి అనేది కేవలం ఒక ధోరణి మాత్రమే కాదు, అది ఒక సంస్కృతి. అనారోగ్యకరమైన జీవనశైలి ఎంపికలు కావచ్చు, భావోద్వేగ ప్రతిచర్య కావచ్చు, నిరంతరం గుర్తింపు కోసం ఆరాటపడడం కూడా కావచ్చు... దీర్ఘకాలంలో మనకు ఏది మంచిది అనే దానికన్నా... ఇప్పుడు ఏది బాగుంటుందనుకుంటామో దాన్నే మనం పదేపదే ఎంచుకుంటూ ఉంటాం. మానసికమైన దృక్పథంలోంచి చూసినప్పుడు, ఇది 'ఆలస్యమైపోయిన తృపి'?త అనే భావనకు దగ్గరగా ఉంటుంది. భవిష్యత్ ప్రయోజనాలకు అనుకూలంగా ఉంటూ... తక్షణం లభించే ప్రతిఫలాలను తిరస్కరించే వ్యక్తులు భావోద్వేగపరంగా, సామాజికంగా, వృత్తిపరంగా మెరుగైన ఫలితాలు పొందుతారు. లింబిక్ వ్యవస్థ, ప్రీఫ్రంటల్ కార్టెక్స్ మధ్య జరిగే పరస్పర చర్య ఉదాహరణతో దీని గురించి న్యూరోసైన్స్ వివరిస్తుంది.

### దాన్నే ఎంచుకోండి...

ప్రతిరోజూ హృదయపూర్వకమైన ధ్యానం ద్వారా... మనస్సు క్రమంగా ప్రశాంతతంగా మారుతుంది, శుద్ధిని పొందుతుంది. శుద్ధి చేసుకొనే అభ్యాసం మనల్ని ప్రేయస్సు వైపు లాగే భావోద్వేగ ముద్రలను (సంస్కారాలను) తొలగించడానికి తరచుగా సాయపడుతుంది. ప్రార్థన మనల్ని ఒక ఉన్నతమైన మూలంతో అనుసంధానిస్తుంది. మన అంతర్గతమైన సంకల్పాన్ని బలోపేతం చేస్తుంది. కాలం గడిచేకొద్దీ ఈ అభ్యాసాలు అంతర్గతమైన అవగాహనను పెంపొందిస్తాయి. ప్రేరణలను అనుసరించి ప్రవర్తించే వ్యక్తి ముందుగానే వాటిని గమనించడం మొదలుపెడతాడు. ఆ విరామమే పరివర్తనాత్మకంగా మారుతుంది. ఒక వ్యక్తి ప్రేయస్సు కన్నా శ్రేయస్సును చైతన్యవంతంగా ఎంచుకోవడానికి అది అనుమతిస్తుంది. హృదయం సూక్ష్మ విచక్షణను (వివేకాన్ని) పెంచుకుంటుంది. ఒకప్పుడు సంఘర్షణగా ఉన్నది ఇప్పుడు సహజమైన ప్రాధాన్యతగా మారుతుంది. కాబట్టి, హార్ట్‌ఫుల్‌నెస్ బయటి నుంచి క్రమశిక్షణను విధించదు, లోపలి నుంచి దాన్ని మేల్కొలుపుతుంది. మనలోని ఉన్నతమైన తోడేలుకు బలంతో కాకుండా... అవగాహన, ప్రేమ, అంతర్గత అనుసంధానత ద్వారా పోషణ లభిస్తుంది. జీవితంలోని ప్రతి కూడలిలోనూ ఆగండి. 'ఇప్పుడు ఇది నాకు కేవలం సంతోషాన్ని కలిగిస్తోందా? లేదంటే నన్ను మరింత గొప్ప స్థితి కోసం తీర్చిదిద్దుతోందా?' అని ఆలోచించండి. మిమ్మల్ని ఉన్నతివైపు నడిపించే తోడేలుకు ఆహారాన్ని అందించండి. శ్రేయస్సు మీ స్వభావంలో భాగం అయ్యేవరకూ దాన్ని పదేపదే ఎంచుకోండి.

### రెండు తోడేళ్ళు

ప్రేయస్సు తత్త్వాన్ని పదే పదే ఎంచుకోవడం అనే ప్రక్రియ శరీరంలో ఎలా వ్యక్తమవుతుందో ఒక కార్డియాలజిస్టుగా నేను తరచుగా చూస్తూ ఉంటాను. కదలకుండా ఉండే అలవాట్లు, సరైన ఆహారాన్ని తీసుకోకపోవడం, ఒత్తిడికి లొంగిపోవడం, వ్యసనాలు వీటిలో ప్రధానమైనవి. ఈ ఎంపికలు ఎక్కువై పోగు పడి... అధిక రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధమైన వ్యాధులకు దారితీస్తాయి. శ్రేయస్సు ఆధారితమైన జీవితం... క్రమశిక్షణ, వ్యాయామం, భావోద్వేగ సమతుల్యతల ద్వారా శక్తిమంతమైన నివారణ ఔషధంగా పని చేస్తుంది. శ్రేయస్సు, ప్రేయస్సులను మనలో ఉండే రెండు తోడేళ్ళుగా దాజీ అభివర్ణించారు. ఒకటి ఉన్నతమైన ఆకాంక్ష, దయ, క్రమశిక్షణ, ఆధ్యాత్మికమైన పరిణామాలకు ప్రతీక. మరొకటి భోగ విలాసాలు, పరధ్యానం, అహం ద్వారా ప్రేరితమయ్యే వాంఛలకు ప్రతీక. మనం దేన్ని పెంచి పోషిస్తామో అది మరింత బలపడుతుంది. ఉన్నతమైన తోడేలుకు చైతన్యవంతమైన పోషణను అందించే ఆచరణాత్మకమైన, అనుభవపూర్వకమైన మార్గాన్ని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం అందిస్తుంది.

---

## కాళేశ్వరం భూ గర్భంలో సమస్యలు

కరీంనగర్ : తెలంగాణలో రాజకీయంగా వివాదాస్పద అంశాల్లో ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్ట్ అతిముఖ్యమైనది. భారీ ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మూడేళ్ల నుంచి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక విషయం బయటపడింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, మరియు సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భంలో అనేక సాంకేతిక లోపాలు ఉన్నట్లు గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ పరీక్షలలో తేలింది. బ్యారేజీల కొన్ని వెంట్స్ (నీరు ప్రవహించే మార్గాలు) కింద ఖాళీ ప్రదేశాలు ఏర్పడి నీరు చేరడం (కేవిటీస్), పెద్ద పరిమాణంలో బోల్డర్లు, దెబ్బతిన్న రాతి పొరలు, రాళ్ల దిగువ భాగాన పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ జియోఫిజికల్ పరిశీలనల ఆధారంగా పుణెలోని ప్రసిద్ధ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ డైరెక్టరు సెల్వబాలన్ ఒక సమగ్ర నివేదికను తెలంగాణ నీటిపారుదల శాఖకు పంపారు. 3 బ్యారేజీల దిగువన సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భంలో ఉన్న పరిస్థితులు, సీపేజీ మార్గాలు, అనామలీస్ (భిన్నమైన పరిస్థితులు)ను అధ్యయనం చేయడానికి ఈ అధునాతన జీపీఆర్ పరీక్షలను సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహించింది. ఈ అధ్యయనంలో భాగముగా మూడు బ్యారేజీల్లోని మొత్తం 225 వెంట్లకు గాను 217 వెంట్స్ వద్ద క్షేత్రస్థాయి అధ్యయనాలు జరిగాయి. ఈ నివేదికలోని వివరాల ప్రకారం, మేడిగడ్డ బ్యారేజీలోని 7 వెంట్స్ దిగువన అత్యంత తీవ్రమైన అనామలీస్ నమోదయ్యాయి. కీలకమైన మేడిగడ్డలోని 7వ బ్లాక్‌కు చెందిన 17, 18, 19, 20, 21 వెంట్లలోనూ, 8వ బ్లాక్‌లోని 7వ వెంట్‌లోనూ, 5వ బ్లాక్‌లోని 35వ వెంట్‌లోనూ ఈ భూగర్భ లోపాలను గుర్తించినట్లు నివేదికలో తెలిపారు. ఇదే ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీలోని 5వ బ్లాక్‌లో ఉన్న 47వ వెంట్ ఎగువ భాగంలోనూ, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, మరియు 53వ వెంట్స్ వద్ద ఎగువ, దిగువ ప్రాంతాలలో సమస్యలు ఉన్నట్లు తేలింది. ఈ 3 బ్యారేజీలలో కలిపి మొత్తం 11 వెంట్స్ కింద మాత్రమే ఎలాంటి సమస్యలు లేదా అనామలీస్ లేవని, మిగతా వాటిలో చిన్న సమస్యలు ఉన్నాయని నివేదికలో వెల్లడించినట్లు సమాచారం. 6 వెంట్స్ వద్ద పదికి పైగా విభిన్నమైన అనామలీస్ జోన్లను శాస్త్రవేత్తలు నమోదు చేశారు. ఇటువంటి పరిస్థితులు నీటి అంతర్గత సీపేజ్, పైపింగ్ వంటి ప్రమాదకర పరిణామాలకు దారితీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, జీపీఆర్ పరీక్షలు కేవలం భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి మాత్రమే పరిమితమని, నేరుగా స్ట్రక్చరల్ లోపాలను ఇవి నిర్ధారించలేవని సీడబ్ల్యూపీఆర్ఎస్ స్పష్టం చేసింది. అందువల్ల పునరావాస లేదా మరమ్మతు పనులు ప్రారంభించే ముందు బోర్‌హోల్, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ వంటి ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించడం అనివార్యమని సూచించింది. ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణ సమయంలో ముందస్తు భూగర్భ అన్వేషణ పరీక్షలు చేపట్టకపోవడం వల్లే ఈ సమస్యలు ముందుగా గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ టీమ్ పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం ఈ నివేదికను బయటపెట్టడం గానీ, మంత్రులు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ అధికారులు గానీ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ ( సీడబ్ల్యూపీఆర్ఎస్) నివేదికపై స్పందిస్తే మరిన్ని విషయాలు బయిటకు వచ్చే అవకాశం ఉంది.



# యుద్ధ క్షేత్రంలో ప్రాణదాతలు

**యుద్ధం అంటే పోరాటం మాత్రమే కాదు.. చావును ఎదిరించి నిలిచే గుండె ధైర్యం కూడా. ఉక్రెయిన్ సరిహద్దుల్లో బాంబుల వర్షం కురుస్తున్నా, తుపాకుల మోత వినిపిస్తున్నా.. అంబులెన్స్ స్టీరింగ్ పట్టి మృత్యువు నోటి నుంచి ప్రాణాలను లాక్కువస్తున్నారు ముగ్గురు ధీర వనితలు.. ఇన్నా, అలీనా, నటాలియా. వీరు అంబులెన్స్ డ్రైవర్లు మాత్రమే కాదు.. యుద్ధభూమిలో ప్రాణం పోసే వైద్య నిపుణులు. ఉక్రెయిన్‌లోని ఖార్కివ్. ప్రస్తుతం ఈ ప్రాంతం ఒక గాయపడిన నగరం. ఇప్పుడు అక్కడి గాలిలో ఆక్సిజన్ కంటే గన్‌పౌడర్ వాసనే ఎక్కువగా ముక్కును తాకుతోంది. ఎటుచూసినా కూలిపోయిన భవనాలు, ధ్వంసమైన రోడ్లు. ఈ విలయం మధ్య ఒక అంబులెన్స్ సైరన్ వినిపిస్తే.. అది ఆశకు సంకేతం. ఆ అంబులెన్స్‌లను నడిపిస్తూ, వాటిలో వైద్యం అందిస్తూ మృత్యువును ఎదిరిస్తున్నారు ముగ్గురు మహిళలు. 'మోయాస్' అనే అంతర్జాతీయ సంస్థ తరపున వారు చేస్తున్న ఈ పని యుద్ధక్షేత్రంలో స్త్రీ శక్తికి నిలువుటద్దం.**

### కర్తవ్యమే దైవం

అనస్థీషియాలజిస్ట్, మెడికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఇన్నాకు మాటల కంటే చేతలే ఎక్కువ. ఆమె కళ్లలో యుద్ధం తాలూకా అలసట ఉండదు. నిశ్చలమైన లక్ష్యం కనిపిస్తుంది. ఒక వైద్యురాలిగా ఆమెకు విజయం అంటే మెడల్స్ కాదు.. ఒక ప్రాణం నిలబడటం. "యుద్ధం వచ్చినప్పుడు లింగభేదానికి తావుడందు. దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ సైనికులే. కొందరు ఆయుధాలు పడితే, మేం వైద్యం ద్వారా మా బాధ్యతను నెరవేరుస్తున్నాం" అంటారు ఇన్నా. పురుషాధిక్యం ఎక్కువగా ఉండే యుద్ధ వాతావరణంలో ఆమెకు ఎప్పుడూ వివక్ష ఎదురుకాలేదు. కారణం.. ఆమె చూపే వృత్తి నైపుణ్యం. గంటల తరబడి క్షతగాత్రుల మధ్య గడిపాక, ఆ మానసిక ఒత్తిడిని జయించడానికి ఆమె ఎంచుకునే మార్గం నిద్ర. ఆ తర్వాత క్రీడల ద్వారా తన శరీరాన్ని, మనసును మళ్లీ సిద్ధం చేసుకుంటారు. ఆమె ఉక్కు సంకల్పం ముందు యుద్ధ బీభత్సం కూడా తల వంచాల్సిందే.

### విలయంలోనూ చెదరని సంకల్పం

ఒక యూనిట్ లీడర్‌గా అలీనా బిలౌస్ బాధ్యత చాలా సంక్లిష్టమైనది. అంబులెన్స్ ఎటు వెళ్లాలి? ఏ బృందం ఎక్కడ ఉండాలి? మెడిక్స్‌తో కమ్యూనికేషన్ ఎలా ఉంది? ఇలా ప్రతి అంశాన్ని ఆమె పర్యవేక్షించాలి. ఆమె దృష్టిలో టీం వర్క్ అంటే ఒక యంత్రం లాంటిది కాదు.. ఒక 'జీవి' లాంటిది. ఒక అవయవానికి దెబ్బ తగిలితే మరొకటి ఎలా స్పందిస్తుందో, తన టీం కూడా అలాగే ఒకరికి ఒకరు తోడుండాలని ఆమె కోరుకుంటారు. యుద్ధం అలీనా నుంచి చాలా లాగేసుకుంది. కుటుంబానికి దూరంగా, రేపటి గురించి ఎలాంటి ప్లాన్స్ లేకుండా గడపడం మామాలు విషయం కాదు. "మేం యుద్ధంలో పురుషులతో సమానంగా పోరాడుతున్నాం. కానీ, ఈ క్రూరత్వం మధ్య కూడా మాలోని సౌకుమార్యాన్ని, అందాన్ని, ప్రేమను కాపాడుకోవాలని అనుకుంటాం.
రాక్షసత్వం రాజ్యమేలుతున్న చోట మనిషిగా మిగిలి ఉండటమే పెద్ద విజయం" అని ఆమె చెప్పే మాటలు గుండెను హత్తుకుంటాయి. అలసిపోయినప్పుడు ఒక కప్పు వేడి కాఫీ, లేదా పార్క్‌లో చిన్న నడక ఆమెకు మళ్లీ శక్తినిస్తాయి.

### ప్రతి క్షణం ఒక సవాల్

మెడిక్‌గా పనిచేస్తున్న నటాలియా తారాస్యుక్ జీవితం క్షణమొక సవాల్. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే లోపు ఇచ్చే చికిత్స అత్యంత కీలకం. అక్కడ భయం ఉంటే ప్రాణం పోతుంది. అందుకే ఆమె మెదడు కేవలం 'అల్గారిథమ్స్' (వైద్య సూత్రాలు) మీద పనిచేస్తుంది. బాంబులు పడుతున్నా, రోగి నాడిని పట్టుకోవడంలో ఆమె చేయి వణకదు. యుద్ధం మొదలైన మొదటి రోజు నుంచే ఆమె ఈ సేవలో ఉన్నారు. ఈ రెండేళ్ల కాలం ఆమెకు జీవితం విలువను నేర్పింది. ఒక శ్వాస, ఒక కౌగిలింత, ఒక పలకరింపు ఎంత విలువైందో ఆమెకు అర్థమైంది. ఇంటికి వెళ్లాక ఒక కూతురిగా, ఒక తల్లిగా ఆమె తన బాధ్యతలు నెరవేరుస్తారు. తన కొడుకుతో మాట్లాడటం, సైకాలజీ పుస్తకాలు చదవడం ద్వారా ఆమె తన మనసును కుదుటపరుచుకుంటారు. "వైద్యం ఎంత ముఖ్యమో, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం" అని ఆమె బలంగా నమ్ముతారు.

### యోధుల కన్నా తక్కువేమీ కాదు

ఈ ముగ్గురు మహిళల కథలు ఒక ఉదాహరణ మాత్రమే. యుద్ధక్షేత్రంలో మహిళలు అంటే బాధితులు మాత్రమే కాదు.. వారు బలమైన నాయకులు, నిర్ణేతలు, రక్షకులు. తుపాకి పట్టిన సైనికుడికి ఎంత ధైర్యం కావాలో, రక్తసిక్తమైన దేహాలను మోస్తూ అంబులెన్స్ నడిపే ఈ మహిళలకు కూడా అంతే గుండె నిబ్బరం కావాలి. వీరు కోరుకునేది గుర్తింపు మాత్రమే కాదు.. సమానత్వం. వృత్తిలో రాణిస్తున్నప్పుడు లింగ వివక్షకు తావులేదని వీరు నిరూపించారు. ప్రపంచం యుద్ధాల గురించి మాట్లాడుకుంటున్నప్పుడు, ఈ ధీర వనితలు ఆ యుద్ధం ఆర్పేస్తున్న ప్రాణాలను మళ్లీ వెలిగించే ప్రయత్నంలో బిజీగా ఉన్నారు. ఖార్కివ్ గడ్డపై వీరు చిందిస్తున్న ప్రతి చెమట చుక్క ఒక కొత్త ఆశకు ఊపిరి పోస్తోంది.

**చిన్నప్పుడు తనకు ఎదురైన ఓ చేదు అనుభవం... బాలికలను విద్యావంతులను చేయాలనే దృఢ సంకల్పాన్ని కలిగించింది. మహిళల పట్ల వేళ్లూనుకున్న వివక్షను రూపుమాపి... వారిని ఉన్నతంగా నిలబెట్టే దారిలో తొలి అడుగుకు నాంది అయింది. 'ఎడ్యుకేట్ గర్ల్స్' స్వచ్ఛంద సంస్థను స్థాపించి... దేశ వ్యాప్తంగా లక్షలమంది గ్రామీణ బాలికలను బడి బాట పట్టిస్తున్న సఫీనా హుసేన్ స్ఫూర్తిదాయక కథ ఇది.**



# వివక్షను దాటి చైతన్యం వైపు

"దాదాపు రెండు దశాబ్దాల కిందటి మాట... ఉత్తరాఖండ్ ముసోరీ సమీపంలోని ఓ గ్రామం. స్థానిక ప్రజల కోసం ఆరోగ్య కేంద్రం ఒకటి ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతానికి వెళ్లాను. మా నాన్న కూడా నాతో వచ్చారు. అక్కడి మహిళలు నాన్నను అడిగారు... 'మీకు ఎంతమంది పిల్లలు' అని. 'ఈమె ఒక్కతే' అని చెప్పారు. ఆ క్షణం వారి ముఖ కవళికలు మారిపోయాయి. కూతురు పుట్టడం ఏదో విషాదమన్నట్టుగా చూస్తూ... 'మీరు ఇంకా వయసులోనే ఉన్నారు. కొడుకు కోసం ప్రయత్నించండి' అని నాన్నకు సలహా ఇచ్చారు. అది నన్ను బాధించింది. ముఖ్యంగా... మగపిల్లల కంటే ఆడపిల్లలను తక్కువ చేసి చూసే వారి ఆలోచనా ధోరణి కలవరపెట్టింది. సాంకేతికంగా ఎంతో ఎత్తుకు ఎదుగుతున్నా... ఇంకా పితృస్వామ్య పోకడలు పట్టి పీడిస్తున్నాయని అర్థమైంది. ఈ పరిస్థితిలో మార్పు తేవాలని గట్టిగా నిర్ణయించుకున్నా.

### లండన్ వెళ్లి...

నేను పుట్టి పెరిగిందంతా ఢిల్లీలోనే. పాఠశాల విద్యాభ్యాసం తరువాత బ్రిటన్ వెళ్లాను. 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్' (ఎల్ఎసఈ)లో బీఎస్సీ చదివాను. అనంతరం దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని వెనుకబడిన ప్రాంతాలకు వెళ్లాను. కొన్నేళ్లు అక్కడి ప్రజలతో కలిసి పని చేశాను. ఇంతటి శక్తిని, ఆత్మస్థైర్యాన్ని నాకు ఇచ్చింది చదువు మాత్రమే. ఈ విషయం అనుభవపూర్వకంగా అర్థమైన వెంటనే భారత్‌కు తిరిగి వచ్చేశాను. వివక్షకు గురవుతున్న గ్రామీణ ప్రాంతాల బాలికల అభ్యున్నతికి చదువు మాత్రమే మార్గమని గ్రహించాను. వివిధ కారణాలతో చదువుకు దూరమైన బాలికలను గుర్తించి, వారిని తిరిగి బడి బాట పట్టించే కార్యక్రమాన్ని భుజానికి ఎత్తుకున్నాను. దాని కోసం ముంబయిలో 'ఎడ్యుకేట్ గర్ల్స్' పేరుతో 2007లో ఒక స్వచ్ఛంద సంస్థ నెలకొల్పాను. విద్య నాకు ఎలాంటి అవకాశాలను ఇచ్చిందో... అవే అవకాశాలను గ్రామీణ, అణగారిన వర్గాల బాలికలకు కూడా కల్పించాలని సంకల్పించాను.

### విద్య... ప్రగతి...

'ఎడ్యుకేట్ గర్ల్స్' ద్వారా ప్రధానంగా రెండు కార్యక్రమాలపై దృష్టి పెట్టాను. ఒకటి... విద్య. రెండోది ప్రగతి. 'విద్య'లో భాగంగా గ్రామీణ, మారుమూల పల్లెల్లో చదువుకు దూరమైన ఆరు నుంచి పధ్నాలుగేళ్ల మధ్య వయసు బాలికలను గుర్తించడం, వారిని మళ్లీ బడి బాట పట్టించడం. సాధారణ పాఠశాల విద్యాభ్యాసానికి అర్హతలేని 15 ఏళ్ల బాలికల నుంచి 29 ఏళ్ల యువతులకు మద్దతుగా నిలవడం. వారికి విద్యతో పాటు నైపుణ్యం పెంచుకోవడానికి, స్వశక్తితో ఎదగడానికి కావల్సిన అంశాలను బోధించడం. పితృస్వామ్యం, పేదరికం లాంటి సామాజిక అవరోధాలు మహిళలను వెనక్కు నెట్టేస్తున్నాయి. దీనివల్ల చిన్న వయసులోనే బడి మానేస్తున్నారు. బాల్య వివాహాలకు బలవుతున్నారు. ఇంటి పనులకే పరిమితమవుతున్నారు. అదేవిధంగా వ్యవస్థాగత అడ్డంకులు వ్యక్తిగత స్వేచ్ఛను, నిర్ణయాధికారాన్ని హరిస్తున్నాయి. ఫలితంగా ఏటా లక్షలమంది గ్రామీణ బాలికలకు తమ చదువును కొనసాగించడం ఆచరణ సాధ్యంకాని అంశంగా మారిపోయింది. పితృస్వామ్యం అబ్బాయిని ఒక ఆస్తిగా, అమ్మాయిని ఒక బాధ్యతగా భావిస్తోంది. ఈ అసమానతలు పోవాలంటే ఆడపిల్ల చదువుకోవాలి.

### ఇరవై లక్షలమందికి...

బడి మానేయడం కావచ్చు, బాల్య వివాహాలు కావచ్చు... ఏ ప్రాంతంలో సమస్య ఎక్కువగా ఉందో ముందుగా ఆ ప్రాంతంపై దృష్టి పెడతాం. పద్దెనిమిదేళ్ల కిందట రాజస్థాన్ పాలి జిల్లాలోని యాభై గ్రామాలలో మా కార్యక్రమం మొదలుపెట్టాం. నాటి నుంచి స్థానిక ప్రజలు, నాయకులు, ప్రభుత్వ సహకారంతో అడుగులు వేస్తున్నాం. ఇప్పటివరకు వివిధ రాష్ట్రాల్లోని 30 వేలకు పైగా గ్రామాల్లో... 22 లక్షలమంది బాలికలను తిరిగి బడికి వెళ్లేలా ప్రోత్సహించాం.

### అరుదైన పురస్కారాలు...

మా 'ఎడ్యుకేట్ గర్ల్స్'తో కలిసి పలు రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు, వేలమంది వాలంటీర్లు, సామాజిక కార్యకర్తలు పని చేస్తున్నారు. వారందరి కృషి ఫలితంగా ఎన్నో మైలురాళ్లను అధిగమించాం. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చినందుకు గానూ రెండుసార్లు ఖతార్ ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక 'వైజ్ ప్రైజ్' అందుకున్నాను. నేను చదివిన ఎల్ఎ?సఈ నుంచి గౌరవ డాక్టరేట్ పొందటం మరిచిపోలేని అనుభూతి. అలాగే ఇటీవల ప్రకటించిన టైమ్స్ గ్లోబల్ లీడర్స్ జాబితాలో నాకు చోటు దక్కింది. ఇంకా ఎన్నో పురస్కారాలు నన్ను వరించాయి. ఇవన్నీ నా సంకల్పానికి బలాన్ని, ప్రోత్సాహాన్ని ఇస్తాయి."



# ఈసారైనా హిట్ అందుతుందా..

గత కొన్నేళ్లుగా కోలీవుడ్ స్టార్ హీరో తలా అజిత్ కుమార్ సరైన సాలిడ్ హిట్ పడకపోవడం, మరోవైపు ఆయన వరుసగా సినిమాలు చేయకుండా సుదీర్ఘ విరామం తీసుకోవడం అభిమానులను కాస్త నిరాశకు గురిచేస్తోంది. అయితే, తమిళ చిత్రసీమలో అగ్ర కథానాయకుడైన దళపతి విజయ్ సినిమాలు తగ్గించుకుని రాజకీయాల వైపు అడుగులు వేసి సినిమాలకు దూరం అవ్వడంతో.. ఇప్పుడు కోలీవుడ్ బాక్సాఫీస్ ఆశలన్నీ ఒక్కసారిగా అజిత్ పైనే పడ్డాయి. విజయ్ లేని లోటును భర్తీ చేస్తూ కోలీవుడ్‌ను ముందుండి నడిపించే భారం ఇప్పుడు అజిత్‌పైనే ఉందనే చర్చ ఇండస్ట్రీలో నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే అజిత్ తన తదుపరి బిగ్ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించాడు. యంగ్ డైరెక్టర్ అధిక్ రవిచంద్రన్‌తో కలిసి ఆయన మరో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు శ్రీకారం చుట్టాడు. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమా రాగా, అది తెలుగులో ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ విజయాన్ని అందుకోలేకపోయింది. ఇక దీంతో ఈసారి ఎలాగైనా హిట్ కొట్టాలని అధిక్ చాలా పగడ్బంధీగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రానికి డేర్ డెవిల్ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని అజిత్ భార్య షాలిని అజిత్ కుమార్ బ్రేవ్ హార్ట్స్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తుండగా, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ – అజిత్ కాంబోలో రాబోతున్న డేర్ డెవిల్ ప్రాజెక్ట్ పై తమిళ తంబీలు భారీ అంచనాలు పెట్టుకున్నారు. విజయ్ తో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, అజిత్ ఈ డేర్ డెవిల్ తో గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేస్తారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. పక్కా మాస్ యాక్షన్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు రానుంది. మరి ఈ సినిమాతోనైనా ఈ కాంబో హిట్ ట్రాక్ ఎక్కుతుందేమో చూడాలి.



# నన్ను మార్కెటింగ్ కోసం వాడుకుంటున్నారు

కోలీవుడ్ నుంచి పాన్ ఇండియా స్థాయికి ఎదిగిన నటుడు విజయ్ సేతుపతి. విలక్షణమైన కథలను ఎంచుకుంటూ విలక్షణ నటుడిగా ఎదిగాడు. పిజ్జా, విక్రమ్ వేద, 96, మాస్టర్, ఉప్పెన, విక్రమ్, జవాన్, మహారాజ వంటి విభిన్నమైన సినిమాలతో భారతీయ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును, స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్నాడు. హీరోగానే కాకుండా విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కాకుండా కొన్ని సినిమాల్లో క్యామియో పాత్రలు చేస్తూ ప్రేక్షకుల మనసు గెలుచుకున్నాడు. అయితే, తాజాగా ఆయన ఒక సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై ఏ సినిమాలోనూ అతిథి లేదా క్యామియో పాత్రలు చేయకూడదని గట్టి నిర్ణయం తీసుకున్నట్లు విజయ్ సేతుపతి వెల్లడించాడు. సూపర్ స్టార్ రజనీకాంత్ పై ఉన్న అపారమైన గౌరవంతో జైలర్ 2 చిత్రానికి మాత్రమే దీని నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు స్పష్టం చేశాడు. 'జైలర్ 2 లో నా పోస్టర్ రిలీజ్ అయినా జనాలు రజనీ సార్‌నే చూస్తారు. కానీ ఇతర సినిమాలలో నా క్యామియో పాత్రలను ప్రమోషన్లు, మార్కెటింగ్ కోసం వాడుకుంటున్నారు. ఇది నేను ప్రధాన పాత్రలో నటించే సినిమాలపై తీవ్ర నెగెటివ్ ప్రభావం చూపుతోంది' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. తన స్టార్‌డమ్‌ను కేవలం ప్రచారానికి వాడుకోవడం వల్ల సోలో హీరోగా తాను చేసే చిత్రాల బిజినెస్ దెబ్బతింటోందని విజయ్ సేతుపతి చాలా లేట్ గా గ్రహించినట్లు తెలుస్తోంది. సాధారణంగా కథ నచ్చితే విజయ్ ఎలాంటి పాత్రకు చేయడానికి అయినా వెనుకాడడు. కానీ, కొన్ని సినిమాల్లో ఆయన పాత్ర కేవలం మార్కెట్ ని పెంచుకోవడానికి మాత్రమే వాడుకున్నట్లు కనిపిస్తాయి. అందుకే ఇకపై ఎలాంటి చిన్న పాత్రలు, గౌరవ పాత్రలను ఒప్పుకోకూడదని, కేవలం తన సోలో సినిమాలు, ప్రాధాన్యత ఉన్న ప్రధాన పాత్రలపైనే దృష్టి పెట్టాలని డిసైడ్ అయ్యినట్లు తెలుస్తోంది. వర్సటైల్ యాక్టర్ తీసుకున్న ఈ షాకింగ్ నిర్ణయంపై అభిమానులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విజయ్.. మణిరత్నం దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నాడు. ఇది కాకుండా మరో రెండు సినిమాలు సెట్స్ మీద ఉన్నాయి. మరి ఈ సినిమాలతో విజయ్ సేతుపతి ఎలాంటి విజయాలను అందుకుంటాడో చూడాలి.



# మైత్రీని దోచేస్తున్న మౌళి..

సోషల్ మీడియాలో ఇన్స్టాగ్రామ్ రీల్స్, డిజిటల్ కంటెంట్ ద్వారా యూత్‌లో విశేషమైన గుర్తింపు తెచ్చుకున్న మౌళి నటుడిగా తన ప్రయాణాన్ని చాలా గ్రాండ్‌గా ప్రారంభించిన విషయం తెల్సిందే. లిటిల్ హార్ట్స్ సినిమా ద్వారా హీరోగా పరిచయమై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్నాడు. ఆ సినిమా ఇచ్చిన ఘనవిజయంతో మౌళి టాలీవుడ్‌లో సరికొత్త ల్యాండ్‌మార్క్ క్రియేట్ చేశాడు. ఇక ఈ సినిమా తరువాతవచ్చిన ప్రతి కథను ఓకే చేయకుండా మంచి మంచి కథలను ఎంచుకుంటూ కెరీర్ లో ఆచితూచి అడుగులు వేస్తున్నాడు.
మొదటి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్న మౌళి, ఇప్పుడు తన రెండవ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో చేస్తుండటం విశేషం. యంగ్ డైరెక్టర్ శ్రీను కంబాల దర్శకత్వంలో మౌళి హీరోగా నటిస్తోన్న చిత్రం దొంగనాకొడుకు. ఈ చిత్రంలో మౌళి సరసన సుస్మితా శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. అవుట్ అండ్ అవుట్ రాబరీ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. తాజాగా దొంగ నా కొడుకు టైటిల్ పోస్టర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇక ఈ టైటిల్ గురించి మౌళి ఎక్స్ ద్వారా చెప్పుకొచ్చాడు. 'ఈసారి కామెడీతో పాటు ట్విస్టులు కూడా చాలా. టైటిల్ కొంచెం కమర్షియల్ గా అనిపించవచ్చు. కానీ, నన్ను నమ్మండి. సినిమాలో చాలా ఉన్నాయి. త్వరలోనే థియేటర్స్ లో కలుద్దాం' అంటూ పోస్ట్ చేశాడు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. మరి ఈ సినిమాతో మౌళి ఎలాంటి హిట్ ని అందుకుంటాడో చూడాలి.

## Cinema



# వివాదానికి చెక్ పెట్టేందుకు.. రంగంలోకి సూర్య!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్యకు తమిళంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎంతటి భారీ ఫ్యాన్ బేస్ ఉందో తెలియంది కాదు. 'గజిని' సినిమా నుంచి రజనీకాంత్, కమల్ హాసన్ తర్వాత తెలుగు ప్రేక్షకులు సొంత కథానాయకుడిగా ఆదరించిన తమిళ స్టార్లలో సూర్య అగ్రస్థానంలో నిలిచారు. అయితే, ఆ తర్వాత సరైన విజయాలు లేకపోవడంతో కొంత మార్కెట్ తగ్గినా.. ఇటీవల వచ్చిన 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు') ఘన విజయంతో సూర్య మళ్లీ గ్రాండ్‌గా బాక్సాఫీస్ వద్ద కంబ్యాక్ ఇచ్చారు. ఈ సినిమా తెచ్చిపెట్టిన ఉత్సాహంతో ఆయన రాబోయే చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'పై అంచనాలు భారీగా పెరిగాయి. ఇటీవల ఈ సినిమా చుట్టూ ఒక వివాదం రాజుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ ప్రమోషనల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా పూర్తిస్థాయి స్ట్రెయిట్ తమిళ చిత్రమని, దానిని తెలుగులోకి డబ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. దర్శకుడు వెంకీ అట్లూరితో పాటు ఈ సినిమాను నిర్మిస్తోన్న నిర్మాత నాగవంశీ కూడా తెలుగు పరిశ్రమకు చెందినవారు కావడంతో, ఈ చిత్రాన్ని బైలింగువల్ (ద్విభాషా) లేదా స్ట్రెయిట్ తెలుగు సినిమాగా తీస్తారని భావించిన తెలుగు అభిమానులు.. ఈ వ్యాఖ్యలతో కొంత నిరాశకు గురయ్యారు. దీంతో సోషల్ మీడియాలో సైతం చిన్నపాటి చర్చ నడిచింది.
ఈ నేపథ్యంలో నెలకొన్న ఈ అసంతృప్తిని, వివాదాన్ని చక్కదిద్దేందుకు హీరో సూర్య స్వయంగా రంగంలోకి దిగనున్నారనేలా టాక్ నడుస్తోంది. హైదరాబాద్ వేదికగా జరిగే భారీ ప్రమోషనల్ ఈవెంట్లకు హాజరై, తెలుగు మీడియా, అభిమానులతో నేరుగా ముచ్చటించడం ద్వారా ఈ నెగెటివిటీకి చెక్ పెట్టాలని సూర్య అండ్ టీమ్ ప్లాన్ చేస్తున్నారట. తెలుగు ప్రేక్షకులతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని మరోసారి గుర్తుచేస్తూ సూర్య చేయబోయే ప్రమోషన్లు, సినిమా బిజినెస్‌కి మైలేజ్ ఇవ్వడమే కాకుండా, అభిమానుల్లో ఉన్న అపోహలను కూడా పూర్తిగా తొలగిస్తాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. చూద్దాం మరి.. సూర్య ప్లాన్ ఏ మేరకు వర్కవుట్ అవుతుందో..

మీ ప్రత్యేకతను,
మీ వ్యాపార అభివృద్ధికి
కొందరు మాత్రమే
నమ్మకమైన సేవలందిస్తారు..



మీ శ్రేయస్సును ఆకాంక్షించే వారికి
ఆత్మీయతను పంచండి
మధురస్మృతులు
ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి మరింత దగ్గరవ్వండి. మీ కుటుంబం సభ్యులలో, మీ బంధుమిత్రులలో, మీ ఆఫీసులో సహోద్యోగి ఎవరైనా రిటైర్ అవుతున్నా, వైవాహిక జీవితం 60 వసంతాలు పూర్తి చేసి వసంతోత్సవం జరుపుకుంటున్నా, ప్రశంసలు అందుకున్న ఆయా సందర్భాల్లో వారి జీవిత విశేషాలు మధురస్మృతులు తో పంచుకోండి. పలువురికి ఆదర్శప్రాయులు కండి.



మా కార్యాలయము :-
మధురస్మృతులు
మాస పత్రిక
SREEJA SREE PUBLICATIONS
H.No: 1-3-129, Rajendra Nagar,
Mahabubnagar. PIN - 509001.
Ph : 9848997085, 08542-222814
e-Mail : ms.mbnr2@gmail.com

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085